www.vishalabharati.com
epaper:vishalabharati.com

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

సంపుటి:02 సంచిక:62 శుక్రవారం, 22.12. 2023



## తెలంగాణ అసెంబ్లీ నిరవధిక వాయిదా..

- హాట్‌హాట్‌గా సాగిన సమావేశాలు 2 లో
- ఆఖరి రోజు స్వరం పెంచిన అధికార, విపక్షాలు





# కరెంట్ హీట్..

## అసెంబ్లీలో పవర్ లెక్కలపై వాడీ వేడీ'

- విద్యుత్ రంగంపై సర్కార్ వైట్‌పేపర్ రిలీజ్
- డిస్కం అప్పులు రూ. 81,516 కోట్లు
- ట్రాన్స్‌కో అప్పులు రూ.50,136 కోట్లు
- జెన్ కో అప్పులు రూ. 31, 923 కోట్లు
- వ్యవసాయ సబ్సిడీ అంతరం రూ.18, 725 కోట్లు
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- కరెంటు కొనుగోళ్లపై సీఎం జ్యుడీషియల్ ఎంక్వైరీ

**విశాల భారతి, స్టేట్ బ్యూరో**

తెలంగాణ అసెంబ్లీలో విద్యుత్‌పై వాడీ వేడీ చర్చసాగింది. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గురువారం రాష్ట్రంలో ప్రస్తుత పవర్‌పరిస్థితులపై కాంగ్రెస్‌ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసింది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రాష్ట్రంలో కరెంటు శాఖ సంక్షోభంపై గత ప్రభుత్వాలు చేసిన తప్పిదాలను వివరించారు. దీంతో ప్రభుత్వ సంస్థలు, ఆఫీసుల్లో రూ. 28, 842 కోట్ల బకాయిలు ఉన్నాయని ఆయన తెలిపారు. డిస్కంల ద్వారా రూ. 62, 461 కోట్లు నష్టాలు వచ్చాయని వెల్లడించారు. పదేండ్ల బీఆర్ఎస్‌పాలనలో వారు సాధించింది శూన్యమని భట్టి విక్రమార్క మండిపడ్డారు. దీనిపై ప్రతిపక్షాలు భగ్గుమన్నాయి. విద్యుత్ రంగంపై వాస్తవాలు ప్రజలకు, శాసనసభ్యులకు తెలియాలన్న ఉద్దేశంతోనే శ్వేతపత్రం ప్రవేశపెట్టినట్లు ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, ఆర్థిక పురోగతిలో విద్యుత్ రంగం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. పరిశ్రమలు, వ్యవసాయం, రవాణా, వైద్య, సమాచార, సేవా రంగం అభివృద్ధికి నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్తే వెన్నెముకని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్ర మనుగడకు విద్యుత్ రంగ పరిపుష్టి చాలా అవసరమన్న ఆయన, ప్రజల నాణ్యమైన జీవన శైలికి సూచిక విద్యుత్తేనన్నారు. రాష్ట్రావిర్భావం నాటికి ఉన్న ప్రాజెక్టులు, ఆ తర్వాత ప్రారంభించినవి తదితర వివరాలన్నీ శ్వేతపత్రంలో స్పష్టంగా వివరించామన్నారు.

అవసరమైన కొత్త ప్రాజెక్టులు తీసుకురాకపోగా, ఉన్న వాటిని కుదేలయ్యేలా చేసిన అప్పులు ఆందోళనకరంగా ఉన్నాయన్నారు. తెలంగాణ ఏర్పడిన 2014 నాటికి డిస్కంలు రూ.10 వేల 783 కోట్ల రుణంతో ఉండగా, ఈ ఏడాది అక్టోబరు నాటికి

..మిగతా 2 లో



# ప్రధానిని పిక్ పాకెట్ అంటారా?

## చర్యలు తీసుకోవాలని ఈసీకి ఆదేశం

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:** ప్రధాని మోదీ, అమిత్ షా, గౌతమ్ అదానీలను పిక్‌పాకెట్స్ అంటూ కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ విమర్శించడంపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంలో ఢిల్లీ హైకోర్టు తాజాగా కీలక ఆదేశాలు జారీ చేసింది. రాహుల్ వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేసిన కోర్టు ఆయనపై ఎనిమిది వారాల్లోగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మినీ పుష్కర్ణలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది.

రాజస్థాన్‌లోని జలోర్‌లో నవంబర్ 22న ఎన్నికల ర్యాలీ సందర్భంగా రాహుల్ గాంధీ.. ప్రధాని మోదీ హోం మంత్రి అమిత్ షా , ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీలపై విమర్శలు గుప్పించారు. ముగ్గూరు జేబు దొంగలంటూ మండిపడ్డారు. అంతకుమునుపు, మరో సభలో 'అపశకునం' ప్రస్తావనతో ప్రధానిపై విమర్శలు గుప్పించారు. దీంతో, బీజేపీ ఫిర్యాదు చేయడంతో ఈసీ రాహుల్ గాంధీకి నోటీసులు జారీ చేసింది.

ఈ నేపథ్యంలోనే ఢిల్లీ హైకోర్టులో రాహుల్ వ్యాఖ్యలపై ఓ ప్రజాప్రయోజనం వ్యాజ్యం కూడా దాఖలైంది. ఈ సందర్భంగా ఈసీ తన వాదనలు వినిపిస్తూ రాహుల్ గాంధీకి అప్పటికే నోటీసులు పంపించామని కోర్టుకు తెలిపింది. తమ నోటీసులే హెచ్చరికలని పేర్కొంది. అయితే, ఇలాంటి వ్యాఖ్యలను నిరోధించేలా కఠినమైన నిబంధనలు కావాలని పిటిషనర్ తరపు న్యాయవాదులు వాదించారు. పిటిషనర్ తరుపున వాదిస్తున్న సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కూడా రాహుల్ గాంధీని తప్పుబట్టారు. ఈసీ కేవలం నోటీసులతో సరిపెట్టిందని, రాహుల్ గాంధీపై చర్యలు తీసుకునే అధికారాలు ఈసీకి లేవని పేర్కొన్నారు.

అయతే, చట్టాల రూపకల్పనకు సంబంధించి తాము పార్లమెంటుకు ఎటువంటి ఆదేశాలు జారీ చేయలేమని హైకోర్టు స్పష్టం చేసింది. "ఇలాంటి వ్యాఖ్యలను నిరోధించడం ప్రతి ఒక్కరి బాధ్యత. కానీ, ఈసీ చర్యలు తీసుకున్నప్పుడు మేము జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఏముంది? అయితే, ఈ కామెంట్స్ మాత్రం సరైనవి కావని మేము నమ్ముతున్నాం' అని కోర్టు వ్యాఖ్యానించింది. రాహుల్ గాంధీపై తగు చర్యలు తీసుకోవాలని ఈసీని ఆదేశించింది.



# తిన్నది అంతా కక్కిస్తాం

- విద్యుత్‌శాఖలో జగదీశ్‌రెడ్డి రూ. 10 వేల కోట్లు తిన్నడు..
- మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యేకు కూడా వాటా ఉంది
- మాజీ మంత్రి అక్రమాలపై మంత్రి కోమటిరెడ్డి ఫైర్
- విచారణ జరిపించాలని జగదీశ్‌రెడ్డి డిమాండ్
- మంత్రి, మాజీ మంత్రి మధ్య మాటల యుద్ధం

విశాల భారతి, స్టేట్ బ్యూరో: తెలంగాణ అసెంబ్లీలో విద్యుత్ పై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసింది. ఈ సందర్భంగా మాజీ విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, ప్రస్తుత ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మధ్య మాటల యుద్ధం కొనసాగింది. ముందుగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. 'బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటల కరెంట్ అనేది పచ్చి అబద్ధం. ఏ సబ్ స్టేషన్ కు అయినా పోదాం.. 8 నుంచి 12 గంటల కరెంట్ ఇచ్చినట్లు లాక్ బుక్ లో ఉంది.. మేం చెక్ చేసిన తర్వాత లాక్ బుక్ లేకుండా చేశారు వాళ్లు.. 24 గంల కరెంట్ ఇస్తే లాక్ బుక్ ఎందుకు తీసేశారు. పీక్‌అవర్ లో 16 గంటలు ఇచ్చారు. కరెంట్ వస్తుందో లేదో తీగలు పట్టుకోండని గతంలో కేటీఆర్ అన్నారు. సిరిసిల్లలోనే పట్టుకుందామంటే కాంగ్రెస్ వాళ్లు పట్టుకోండి దరిద్రం పోతుందని కేటీఆర్‌అన్నారు. ఈ విద్యుత్ రంగం నుంచి జగదీశ్‌రెడ్డి రూ.10 వేల కోట్ల రూపాయలు తిన్నడు. మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యేకు కూడా వాటా ఉంది.. టెండర్ లేకుండా పవర్ ప్లాంట్ పెట్టారు.. ఫ్రీ కరెంట్ పేటెంట్ కాంగ్రెస్ ది. బీఆర్ఎస్ కు ప్రభాకర్ రావు దోచి పెట్టాడు. ఇప్పుడు బీఆర్ఎస్ వాళ్లు వచ్చి ఏదేదో చెప్తున్నారు.. ఎవరిని వదిలేది లేదు. తిన్నది అంతా కక్కిస్తాం.. దొంగలు అనగానే బీఆర్ఎస్ నేతలు భుజాలు తడుముకుంటున్నారు.. సభను తప్పుదోవ పట్టిస్తున్నారు.. 24 గంటలు కరెంట్ అనేది మభ్య పెట్టడమే.. లాక్ బుక్ బయట పెట్టండి' అని

..మిగతా 2 లో



# పదవుల కోసం పార్టీలు మారిండు

## మేం మాత్రం అలాంటి పని చేయలేదు

- రాష్ట్ర సాధన కోసం ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకున్నం
- దేశాన్ని ఒప్పించి, మెప్పించి తెలంగాణ సాధించాం
- రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు ధ్వజం

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**
పదవుల కోసం సీఎం రేవంత్ రెడ్డి పార్టీలు మారిండు తప్ప.. మేం అలాంటి పని చేయలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకున్నాం.. దాంట్లో తప్పేముందని హరీశ్‌రావు ప్రశ్నించారు. శాసన సభలో విద్యుత్ రంగ పరిస్థితిపై స్వల్పకాలిక చర్చ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. సిద్దిపేట, గజ్వేల్, ఓల్డ్ సిటీ ప్రజలు కరెంట్ బిల్లులు కట్టలేదు. ఇక బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్, టీడీపీ, ఎంఐఎంతో పొత్తు పెట్టుకుందని వ్యాఖ్యానించారు. రేవంత్ చేసిన

..మిగతా 2 లో

# విద్యుత్ కష్టాలకు కాంగ్రెస్సే కారణం

- నీళ్లు, బొగ్గులేని రాయలసీమలో థర్మల్ పవర్ కేంద్రాలు పెడతారా
- 55 ఏండ్ల కాంగ్రెస్ నిర్వాకాన్ని వైట్ పేపర్‌లో చాలా గొప్పగా స్పష్టం చేశారు
- దేశంలో గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రం సఫలమైందా..?
- మాజీ మంత్రి కేటీఆర్

విశాలభారతి,హైదరాబాద్:
తెలంగాణలో విద్యుత్ కష్టాలకు కాంగ్రెస్ పార్టీనే కారణం అని ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. నీళ్లు, బొగ్గు లేని రాయలసీమలో, బొగ్గు లేని విజయవాడలో థర్మల్ పవర్ కేంద్రాలు నెలకొల్పుతారు. తెలంగాణలో ఆ రోజు విద్యుత్ కేంద్రాలు కట్టకుండా, రాష్ట్రం ఏర్పడే నాటికి 27 వందల మెగావాట్ల లోటు నష్టాలతో తమకు అప్పజెప్పారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలో విద్యుత్ రంగ పరిస్థితిపై స్వల్పకాలిక చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. 55 ఏండ్ల కాంగ్రెస్ పార్టీ చరిత్ర, నిర్వాకాన్ని వైట్ పేపర్‌లో చాలా గొప్పగా స్పష్టంగా చెప్పింది. మాకు ప్రజలు 11 సార్లు అవకాశం ఇస్తే 2014 నాటికి ఆరు గంటల కరెంట్ మాత్రమే

..మిగతా 2 లో





# ప్రతి నిర్ణయం పారదర్శకంగా ఉండాల్సిందే

## అధికారులకు స్పష్టం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**
సాగు నీటి రంగానికి సంబంధించి ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం పారదర్శకంగా ఉండాల్సిందేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం ముఖ్యమంత్రి తన నివాసంలో వ్యవసాయ, నీటిపారుదల రంగాలపై మంత్రులు తుమ్మల, ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. 1956 నుంచి 2014 వరకు, 2014 నుంచి 2023 వరకు నిర్మించిన ప్రాజెక్టులు, వాటి నిర్మాణ వ్యయాలు, ప్రాజెక్టుల వారీగా సాగులోకి తెచ్చిన ఆయకట్టు వివరాలను అధికారుల ద్వారా సీఎం తెలుసుకున్నారు. ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన మార్గదర్శకాలు ప్రజలకు

..మిగతా 2 లో

# పదవుల కోసం పార్టీలు మారిండు

మొదటిపేజీ తరువాయి

వ్యాఖ్యలపై హరీశ్‌రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు మాట్లాడుతూ.. సీఎం వ్యాఖ్యలపై క్లారిఫికేషన్ ఇచ్చే ప్రయత్నం చేస్తాను. దండం పెడుతా మైక్ కట్ చేయకండి. సిద్దిపేట, గజ్వేల్, ఓల్ట్ సిటీ ప్రజల మీద సీఎం అక్కసు వెళ్లగక్కే ప్రయత్నం చేశారు. సిద్దిపేటలో, గజ్వేల్, ఓల్ట్ సిటీలో కాంగ్రెస్ గెలవలేదనే బాధలో రేవంత్ ఉన్నారు. దాంతో బిల్లులు అక్కడ ప్రజలు కట్టలేదన్నారు. ఇది వాస్తవం కాదు. అక్కడ ఏదాన్న ఒక్క లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుదో, ఒక ఇండస్ట్రీయలిస్ట్ ఎవరన్న కట్టకపోతే, ఆ బిల్లులు వసూలు చేయండి తప్ప.. నియోజకవర్గ ప్రజలను బద్నాం చేయడం సబబు కాదు అని సీఎం రేవంత్‌కు హరీశ్‌రావు సూచించారు.

బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్‌తో, టీడీపీతో, ఎంఐఎంతో పొత్తు పెట్టుకుందని రేవంత్ వ్యాఖ్యానించారు. అవును మేం పొత్తు పెట్టుకున్నాం. నిజంగా టీఆర్ఎస్ పార్టీ 2004లో కాంగ్రెస్తో పొత్తు పెట్టుకుని, తెలంగాణ ఇస్తామని కామన్ మినిమమ్ ప్రోగ్రాంలో పెట్టి, రాష్ట్రపతి నోట చెప్పి మీరు మోసం చేశారు కాబట్టే ఆ రోజు టీడీపీతో పొత్తు పెట్టుకున్నాం. మేం టీడీపీతో, కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నా.. ఎవరితో పొత్తు పెట్టుకున్నా.. ఈ రాష్ట్ర, దేశ రాజకీయ వ్యవస్థను ఒప్పించి, మెప్పించి తెలంగాణ సాధించాం. మా ప్రయత్నం వల్లే తెలంగాణ రాష్ట్రం వచ్చింది. ఇవాళ మేం సక్సెస్ అయ్యాం. రాష్ట్రాన్ని సాధించాలనే వ్యూహంలో భాగంగానే పొత్తులు పెట్టుకున్నాం. ముఖ్యమంత్రి ఆయన వ్యక్తిగతంగా పదవుల కోసం పార్టీలు మారిండు తప్ప.. మేం అలా చేయలేదు. మేం ఇతర రాజకీయ పార్టీలతో తెలంగాణ కోసం మాత్రమే పొత్తు పెట్టుకున్నాం. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేను అవమానపరిచారు సీఎం. విజ్ఞులైన ప్రజలు మా అభ్యర్థి మాగంటి గోపీనాథ్‌ను గెలిపించారు. ఎంఐఎం పోటీలో ఉండటంలో వల్లే ఆయన గెలిచారని సీఎం మాట్లాడటం సరికాదు. జూబ్లీహిల్స్ ప్రజలను అవమానపరిచే విధంగా సీఎం మాట్లాడటం సరికాదన్నారు హరీశ్‌రావు.

# కరెంట్ హీట్..

మొదటిపేజీ తరువాయి

39 వేల 457 కోట్లకు చేరాయని, ట్రాన్స్కో అప్పులు రూ.2 వేల 911 కోట్లుగా ఉంటే, ప్రస్తుతం రూ.50 వేల 136కోట్లకు చేరినట్లు ఉప ముఖ్యమంత్రి వివరించారు. జెన్ కో అప్పులు రూ.7 వేల 662 కోట్ల నుంచి రూ. 31 వేల 923 కోట్లకు పెరిగాయన్నారు. గత ప్రభుత్వ పాలన సక్రమంగా, ప్రణాళికబద్ధంగా లేక పోవడం వల్ల దూరదృష్టి లేక డిస్కంల లోటు రూ.62 వేల 496 కోట్లకు చేరిందన్నారు. వ్యవసాయ సబ్సిడీ అంతరం రూ.18 వేల 725 కోట్లుగా ఉందన్నారు.

తెలంగాణ రాష్ట్రావిర్భావం నాటికి జెన్ కో స్థాపిక విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 4 వేల 365 మెగా వాట్లు ఉందని భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రం ఏర్పడక ముందే 2 వేల 960 మెగావాట్ల ఉత్పత్తి కేంద్రాలకు ప్రణాళికలు, పనులను కేంద్రంలోని అప్పటి యూపీఏ ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆ కేంద్రాలే విద్యుత్ను అందించడంలో కీలక పాత్ర పోషించాయని భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణకు 1800 మెగా వాట్ల స్థాపిత విద్యుత్ వచ్చేలా పునర్ వ్యవస్థీకరణ చట్టంలో ఆనాటి యూపీఏ ప్రభుత్వం ప్రత్యేక నిబంధనలు రూపొందించిందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం 1080 మెగావాట్ల భద్రాద్రి థర్మల్ ప్రాజెక్టును మాత్రమే పూర్తి చేసిందని భట్టి విక్రమార్క తెలిపారు. అది కూడా ప్రమాణాలకు విరుద్ధంగా సుదీర్ఘ కాలం చేపట్టడం వల్ల పెట్టుబడి వ్యయం పెరిగిందని పేర్కొన్నారు. బొగ్గు గనులకు అత్యంత దూరంగా యాదాద్రి థర్మల్ ప్రాజెక్టును చేపట్టిందని, ఇందులో బొగ్గు సరఫరాకే ఏటా రూ.800 కోట్ల అదనపు వ్యయం వస్తోందన్నారు.

ప్రస్తుతం విద్యుత్ రంగం పరిస్థితి ఆందోళనకరంగా ఉందని భట్టి విక్రమార్క అన్నారు. డిస్కంలు రూ.62 వేల 461 కోట్ల నష్టాల్లో ఉన్నాయని, అక్టోబరు 31 నాటికి డిస్కంలు రూ.81 వేల 516 కోట్ల అప్పుల్లో ఉన్నాయని తెలిపారు. జనరేటర్లకు చెల్లించాల్సిన బకాయిలే రూ.30 వేల 406 కోట్లు ఉన్నాయని వివరించారు. విద్యుత్ ఉత్పత్తి, సరఫరా సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వ శాఖలు రూ.28 వేల 842 కోట్లు చెల్లించాల్సి ఉందని, అందులో సాగునీటి సరఫరా శాఖవే రూ.14 వేల 193 కోట్లని తెలిపారు. విద్యుత్ కొనుగోళ్లు, వాస్తవ సర్దుబాటు కింద గత ప్రభుత్వం రూ.14 వేల 928 కోట్లు చెల్లిస్తామని చెప్పి మాట తప్పిందని ఆరోపించారు.

విద్యుత్ రంగ ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. తెలంగాణ ఏర్పడే నాటికి జెన్‌కో స్థాపిత సామర్థ్యం 4365 మెగా వాట్లు. గత ప్రభుత్వం భద్రాద్రి ప్రాజెక్టును మాత్రమే పూర్తి చేసింది. డిస్కంల ద్వారా వచ్చిన నష్టాలు రూ.62,461 కోట్లు. 31 అక్టోబర్ 2023 నాటికి రూ. 81,516కోట్ల అప్పులు ఉన్నాయి. విద్యుత్ ఉత్పత్తి, సరఫరా సంస్థలకు చెల్లించాల్సిన బకాయిలు రూ.28,673 కోట్లుగా తేలాయి. రోజువారి మనుగడ కోసమే డిస్కంలు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

## జ్యుడీషియల్ ఎంక్వైరీకి సిద్ధం

**– సీఎం రేవంత్‌రెడ్డి**



విద్యుత్ శాఖలో మూడు అంశాలపై న్యాయ విచారణకు తాము సిద్ధంగా ఉన్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. జగదీష్ రెడ్డి వ్యాఖ్యలను స్వాగతిస్తున్నామని.. చత్తీష్ గడ్ ఒప్పందం, భద్రాద్రి, యాదద్రి పవర్ ప్రాజెక్టు పై జ్యుడీషియల్ ఎంక్వయిరీ చేస్తామని చెప్పారు. 24 గంటల కరెంట్ పై అఖిలపక్షంతో నిజనిర్ధారణ కమిటీ వేస్తామని తెలిపారు. గురువారం అసెంబ్లీలో విద్యుత్ రంగంపై జరిగిన చర్చ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఛత్తీస్ ఘడ్ తో టెండర్లు లేకుండా ఒప్పందం చేసుకున్నారని చెప్పారు. ఛత్తీస్ ఘడ్ ఒప్పందంపై ఆనాడే తాము పోరాటం చేస్తే మార్షల్స్ తో తమను సభ నుంచి బయటకు పంపారని గుర్తు చేశారు.

ఛత్తీస్ గడ్ ఒప్పందంపై ఓ అధికారి నిజాలు చెప్తే ఆ అధికారికి డిమోషన్ ఇచ్చి మారుమూల ప్రాంతాలకు పంపారని పేర్కొన్నారు. ఛత్తీస్ గడ్ తో 1000 మెగావాట్ల ఒప్పందం చేసుకున్నారని, ఈ ఒప్పందం వల్ల ప్రభుత్వంపై రూ.1362 కోట్ల భారం పడిందన్నారు. ఛత్తీస్ ఘడ్ ఒప్పందాలపై న్యాయ విచారణకు ఆదేశిస్తామని చెప్పారు. అలాగే యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టుకు కాలం చెల్లిన సంస్థతో ఒప్పందం చేసుకున్నారని పేర్కొన్నారు.

సబ్ క్రిటికల్ టెక్నాలజీకి కాలం చెల్లినా దాన్ని ఉపయోగించి ప్రభుత్వానికి నష్టం చేశారని విమర్శించారు. భద్రాద్రి పవర్ ప్రాజెక్టులో వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. భద్రాద్రి, యాదద్రి పవర్ ప్రాజెక్టు పై జ్యుడీషియల్ ఎంక్వయిరీ చేస్తామని చెప్పారు. ఛత్తీస్ గడ్ ఒప్పందాలు, భద్రాద్రి, యాదాద్రి పవర్ పాయింట్లలో జరిగిన అవినీతిపై జ్యుడీషియల్ ఎంక్వయిరీ చేయిస్తామని చెప్పారు. 24 గంటల కరెంట్ పై అఖిల పక్షంతో నిజనిర్ధారణ కమిటీ వేద్దామని అన్నారు.

జ్యుడీషియల్ ఎంక్వయిరీ చేయాలన్న మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కోరిక మేరకు విచారణ చేయాలని తాను ఆదేశాలిస్తున్నానని తెలిపారు. ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు ఎదురుదాడి చేసినామని అనుకుంటున్నారని తెలిపారు. తొమ్మిదిన్నర ఏళ్లలో గత ప్రభుత్వం వాస్తవాలను సభ ముందు పెట్టలేదన్నారు. విద్యుత్ శాఖను స్కాన్ చేసి వాస్తవాలను సభ ముందు పెడుతున్నామని తెలిపారు. గత పాలకులు వాస్తవాలను హుందాగా ఒప్పుకోవాలని సూచించారు.

# తిన్నది అంతా కక్కిస్తాం

మొదటిపేజీ తరువాయి

కోమటిరెడ్డి ఆరోపించారు. వెంటనే విచారణకు ఆదేశించాలని సీఎంను కోరుతున్నామని కోమటిరెడ్డి అన్నారు.

**సిట్టింగ్‌జడ్జితో విచారణ జరిపించండి**

ఇక, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి జగదీశ్ రెడ్డి కౌంటర్ ఎటాక్ కు దిగారు. విద్యుత్ శాఖలో అవినీతి జరిగితే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని జగదీశ్‌రెడ్డి కోరారు. మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పనికి మాలిన మాటలు మాట్లాడుతున్నారంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అవాస్తవ శ్వేత పత్రం విడుదల చేశారని జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. మంత్రులు అందరూ కలిసి మాట్లాడి ఎన్ని గంటలు కరెంట్ ఇస్తున్నారో చెప్పండి.. ఒక్క రోజు అయిన గతంలో విపక్ష కాంగ్రెస్ ఎమ్మెల్యే లు ప్లకార్డులు పట్టుకునే అవకాశం వచ్చిందా?.. అప్పుల అందరికీ ఉన్నాయి.. ఆస్తులు కూడా ఉన్నాయి.. అప్పులు ఉన్నాయంటే తప్పు చేసినట్టేనా?.. అని ఆయన ప్రశ్నించారు. చేసిన అప్పుతోనే ఎంతో అభివృద్ధి చేశామని మాజీ మంత్రి స్పష్టం చేశారు.

# మంచి చేస్తుంటే విష ప్రచారం

- పిల్లలకు ఇచ్చే ఆస్తి చదువు మాత్రమే
- పేదలకు మంచి చేస్తుంటే ఎందుకీ కడుపు మంట
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



**విశాల భారతి,ఆంధ్రప్రదేశ్:**విద్యార్థులకు మంచి చేస్తుంటే విష ప్రచారం చేస్తున్నారని, విద్యార్థులకు చెడు చేస్తున్నామంటూ తప్పుడు రాతలు రాశారంటూ ఎల్లో మీడియాపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. ''గిట్టని వాళ్లు జగన్ దుబారా చేస్తున్నాడంటూ మాట్లాడుతున్నారు. దేశంలో ఏ ప్రభుత్వం కూడా పేదలకు ఈ స్థాయిలో ఖర్చుచేయలేదు. ఖర్చు చేసే ప్రతీ రూపాయి భావి తరాల కోసమే'' అని సీఎం పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ఎనిమిదో తరగతి విద్యార్థులకు వరుసగా రెండో ఏడాది కూడా రాష్ట్ర ప్రభుత్వం ట్యాబ్స్ పంపిణీ చేపట్టింది. పేదింటి పిల్లలు అంతర్జాతీయ వేదికపై తమ సత్తాచాటాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం మేరకు రూ.620 కోట్ల వ్యయంతో బైజూస్ ప్రీలోడెడ్ కంటెంట్ గల 4,34,185 ట్యాబ్‌స్‌ను 9,424 పాఠశాలల్లోని విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేయనుంది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి నుంచి సీఎం జగన్ గురువారం ఈ పంపిణీని ప్రారంభించారు.దిగజారుడు రాతలు రాయొద్దని చెబుతున్నా : పిల్లలకు ఇచ్చే ఆస్తి చదువు మాత్రమే. విద్యార్థులకు మంచి చేస్తుంటే విష ప్రచారం చేస్తున్నారు. విద్యార్థులకు చెడు చేస్తున్నామంటూ తప్పుడు రాతలు రాశారు. పేద విద్యార్థులపై విషం కక్కొద్దని చెబుతున్నా. దిగజారుడు రాతలు రాయొద్దని చెబుతున్నా. పేద పిల్లల చేతిలో ట్యాబ్‌లు ఉంటే చెడిపోతారంట. పేద విద్యార్థులు ఇంగ్లీష్ మీడియంలో చదవద్దా?. పేద పిల్లలు ఇంగ్లీష్ మీడియం చదివితే తెలుగు అంతరించుకుపోతుందట. పేదలకు మంచి చేస్తుంటే మీకెందుకు ఈ కడుపుమంట. పేదల పిల్లలకు మంచి చేస్తుంటే కొందరు ఏడుస్తున్నారు. ఇటువంటి దిక్కుమాలిన రాజకీయాలతో యుద్ధం చేస్తున్నామని సీఎం జగన్ ధ్వజమెత్తారు.

# రైతు ఆత్మహత్యలు కావు. జగన్ సర్కారు హత్యలు

- పంట నష్టపోయి, ప్రభుత్వం ఆదుకోక రైతు కిశోర్ బాబు ఆత్మహత్య
- పది రోజుల క్రితం బలవన్మరణానికి పాల్పడిన రైతు తుల్లిమిల్లి బసవయ్య
- రైతులు ధైర్యంగా ఉండండి
- 3 నెలల్లో వచ్చే ప్రజా ప్రభుత్వం
- టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్



**విశాలభారతి,ఆంధ్రప్రదేశ్:**గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాల మండలం వీర్లపాలెంలో కిశోర్ బాబు అనే రైతు ఆత్మహత్యకి పాల్పడటం రాష్ట్రంలో రైతన్నల దుస్థితికి అద్దం పడుతోందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తుపాను వల్ల ఐదెకరాల మినుము పంట నష్టపోయి, చేసిన అప్పులు తీర్చే మార్గంలేక కిశోర్ బాబు బలవన్మరణానికి పాల్పడిన సంఘటనతో తీవ్రవిషాదంలో మునిగిపోయానని లోకేష్ విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పదిరోజుల క్రితం దుగ్గిరాలకి చెందిన రైతు తుల్లిమిల్లి బసవ పున్నయ్య ఆత్మహత్య తనని తీవ్రంగా కలిచివేసిందన్నారు. కరువుతో కొంత, తుఫానుతో పూర్తిగా నష్టపోయినా, జగన్ సర్కారు ఆదుకోకపోవడం వల్లే అన్నదాతల ఆత్మహత్యలు జరుగుతున్నాయని, ఇవి జగన్ సర్కారు చేసిన హత్యలు అని లోకేష్ ఆరోపించారు. కౌలు రైతుల ఆత్మహత్యల్లో దేశంలోనే మన రాష్ట్రం రెండో స్థానం, రైతు ఆత్మహత్యల్లో 3వ స్థానంలో ఉండటం వైసీపీ ప్రభుత్వం రైతన్నల పట్ల అవలంబిస్తున్న నిర్లక్ష్యవైఖరికి నిదర్శనమన్నారు. రైతులెవరూ అధైర్యపడి ఆత్మహత్యలు చేసుకోవద్దని, మూడునెలల్లో ప్రజాప్రభుత్వం వచ్చి ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఆత్మహత్యకి పాల్పడిన తుల్లిమిల్లి బసవపున్నయ్య కుటుంబానికి టిడిపి సాయం చేసిందని, కిశోర్ బాబు కుటుంబానికీ అండగా ఉంటామని పేర్కొన్నారు.

# తెలంగాణ అసెంబ్లీ నిరవధిక వాయిదా..

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:** తెలంగాణలో అసెంబ్లీ నిరవధిక వాయిదా పడింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కాంగ్రెస్ తొలిసారి అధికారాన్ని చేజిక్కించుకుంది. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి సహా మిగిలిన ఎమ్మెల్యేలు కూడా ప్రమాణస్వీకారం చేశారు. ఆ తరువాత గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలు వాడి వేడిగా సాగాయి. పాలక, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం సాగింది. గత పాలకుల వైఫల్యాలను ఎత్తి చూపుతూ పాలకపక్షం ముందుకు సాగింది. ఆ తరువాత అనేక సంక్షేమ పథకాలకు సంబంధించిన వాటిపై చర్చించారు మంత్రులు. ఇదిలా ఉంటే కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని పట్టుబట్టింది ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ. రాష్ట్రం లోటులో ఉందంటూ కాంగ్రెస్ చెప్పిన మాటలకు ధీటుగా ప్రతిపక్షం స్పందించింది. రాష్ట్ర పరిస్థితిని అడ్డం పెట్టుకొని హామీలు అమలు చేయకుంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించింది. తాము చెప్పిన ప్రతి హామీ అమలు చేస్తామని కాంగ్రెస్ ధీటుగా బదులిచ్చింది. ఆ తరువాత మాజీ మంత్రి జగదీశ్ రెడ్డికి.. కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి మధ్య తీవ్ర మాటల యుద్ధం జరిగింది. పరుషపదజాలాలతో ఒకరిని ఒకరు విమర్శించుకున్నారు.

గత పాలనలో జరిగిన అక్రమాల గురించి కూడా కాంగ్రెస్ జోరు పెంచింది. శ్వేత పత్రాన్ని విడుదల చేస్తున్నామని ప్రకటించింది. ఇలా మాటల యుద్ధంతో సాగిన సభకు నేటితో తాత్కాలికంగా బ్రేక్ పడింది. గురువారం చివరి రోజు కావడంతో నేతలు తమ మాటలకు పదును పెంచారు. కాంగ్రెస్ విడుదల చేసిన శ్వేతపత్రంపై మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. నేదునూరు ప్రాజెక్టుపై కాంగ్రెస్ స్పష్టమైన ప్రకటన చేయాలని పట్టుబట్టారు. తమ పాలనలో చేసేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ కేంద్రం అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్ బకాయిలపై సభలో పెద్ద రచ్చ జరిగింది.

ఒకానొక సందర్భంలో ఎంఐఎం నేతలు తమ స్వరాన్ని పెంచారు. స్పీకర్ వెల్ లోకి దూసుకొచ్చే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ తమను అణచివేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. విద్యుత్ పై జ్యూడీషియల్ విచారణకు సిద్ధమని రేవంత్ చెప్పారు. అయితే ఒకానొక సమయంలో సభను పొడిగించే ఆలోచన కూడా చేశారు. 22న కూడా సభ జరగాలని నిర్ణయించున్నప్పటికీ కొన్ని కారణాల వల్ల ఈరోజుతో ముగింపు పలికింది. దీంతో సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ వెల్లడించారు.

# విద్యుత్ కష్టాలకు కాంగ్రెస్సే కారణం

మొదటిపేజీ తరువాయి

ఇచ్చామని, అంతటి అసమర్థత, చేతకానితనం మాది అని వారే ఒప్పుకున్నారు అని కేటీఆర్ తెలిపారు. కడపలో రాయలసీమ థర్మల్ పవర్ కేంద్రం పెట్టారు. అక్కడ బొగ్గు ఉందా..? నీళ్లు ఉన్నాయా..? విజయవాడలో బొగ్గు ఉందా..? ఇవాళ బాగా మాట్లాడుతున్నారు. తెలంగాణలో ఆ రోజు విద్యుత్ కేంద్రాలు కట్టకుండా, రాష్ట్రం ఏర్పడే నాటికి 27 వందల మెగావాట్ల లోటు నష్టాలతో తమకు అప్పజెప్పారు. మానకొండూరు నియోజకవర్గంలోని నేదునూరు, చేవెళ్ల నియోజకవర్గంలోని శంకర్‌పల్లిలో ఆనాడు యూపీఏ ప్రభుత్వం గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాలు నెలకొల్పుతామని భూసేకరణ చేశారు. టీఆర్ఎస్ పార్టీగా ఆనాడు ఒక్క దగ్గర ధర్నా చేయలేదు. ఒక వ్యక్తికి వ్యతిరేకంగా ధర్నా చేయలేదు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న గ్యాస్ ఆధారిత కేంద్రాలు ఎందుకు పెట్టడం లేదు అని నిరసన వ్యక్తం చేశాం. బొగ్గు లేని విజయవాడలో థర్మల్ పవర్ కేంద్రం ఎందుకు పెడుతారు..? బొగ్గు, నీళ్లు లేని రాయలసీమలో ఎందుకు పెడుతారు..? అని నాడు తెలంగాణ ప్రయోజనాల కోసం తెలంగాణ బిడ్డలుగా గట్టిగా కొట్లాడినం. నిరసనలు వ్యక్తం చేశాం అని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ దేశంలో గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రం సఫలమైందా..? నేదునూరులో గ్యాస్ అలాకేషన్ అయిందా..? ఆనాడు యూపీఏలో జైపాల్ రెడ్డి పెట్రోలియం శాఖ మంత్రిగా ఉండి, గ్యాస్ అలాకేషన్ చేయలేదు. గ్యాస్ అలాకేషన్ చేయలేదు కాబట్టి ఆ రెండు ప్రాజెక్టులు టేకాఫ్ కాలేదు. ఇప్పుడు టేకాఫ్ చేయండి మీది ప్రభుత్వం. నేదునూరు, శంకర్‌పల్లిలో ఇప్పుడు ఆ ప్రాజెక్టులు పెడుతామని ప్రభుత్వం హామీ ఇవ్వాలి. ఇవాళ నోటికొచ్చినట్టు అవమానిస్తున్నారు. అక్కడ అక్బరుద్దీన్ ఒవైసీని, ఇక్కడ మేం మాట్లాడుతుంటే మమ్మల్ని సీఎం అవమానిస్తున్నారు అని కేటీఆర్ మండిపడ్డారు.

# నేడు భారత్ బంద్ కు మావోయిస్టుల పిలుపు

- ఏపీ ఏజెన్సీలో కరపత్రాలు విడుదల
- భద్రాద్రి, ఛత్తీస్‌గడ్‌బార్డర్‌లో హై అలర్ట్



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:** మావోయిస్టులు శుక్రవారం భారత్ బంద్ కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో భద్రాద్రి జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో పోలీసులు హైఅలెర్ట్ ప్రకటించారు. దీంతో పోలీసులు తెలంగాణ ఛత్తీస్ గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో కూంబింగ్ చేపట్టారు. దండకారణ్యాన్ని భద్రత బలగాలతో జల్లెడ పడుతున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా పోలీస్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఆంధ్ర ప్రదేశ్ లో మావోయిస్టులు విధ్వంసం సృష్టించారు. అల్లూరి జిల్లా చింతూరు ఏజెన్సీలో వీరాపురం దగ్గర వాహనాలపై మావోయిస్టులు దాడికి పాల్పడ్డారు. కార్లకు నిప్పు పెట్టారు. నేడు తాము ఇచ్చిన భారత్ బంద్ పిలుపుని సక్సెస్‌చేయాలంటూ కరపత్రాలను మావోయిస్టులు వదిలి వెళ్లారు. కానీ మావోయిస్టుల డిమాండ్స్ పై ఎలాంటి సమాచారం రాలేదు. బుధవారం పోలీసులు మావోయిస్టుల మధ్య జరిగిన కాల్పులలో 8 మంది మావోలు ప్రాణాలు కోల్పోయారు. దీనికి నిరసనగా భారత్ బంద్ కు మావోయిస్టులు పిలుపు నిచినట్లు తెలుస్తోంది. ఛత్తీస్ ఘడ్ లో మావోయిస్టులకు పోలీసులకు మధ్య భీకరమైన కాల్పులు జరిగాయి. సుక్మా జిల్లా నాగారం పోలీస్ స్టేషన్ పరిధిలోని దండకారణ్యంలో మావోయిస్ట్ బేస్ క్యాంపులను భద్రతా బలగాలు ధ్వంసం చేశాయి. ఈ దాడుల్లో పెద్ద మొత్తంలో మావోయిస్టుల సామాగ్రిని, పేలుడు పదార్థాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ క్రమంలో జరిగిన కాల్పుల్లో భద్రతా బలగాలు ఎనిమిది మంది మావోయిస్టులను చంపేసినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.

# శ్వేతపత్రంతో బొక్కా బోర్లా పడింది

- కేసీఆర్ పాలనలో ఎన్నో విజయాలు
- 24 గంటల విద్యుత్ ఇచ్చాం
- మీడియా సమావేశంలో జగదీశ్ రెడ్డి



**విశాల భారతి,హైదరాబాద్:**కేసీఆర్ పాలనలో విద్యుత్ రంగంలో అనేక విజయాలు సాధించామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. ''ప్రభుత్వం నిన్న ఆర్థిక శ్వేతపత్రంపై బొక్కబోర్లా పడింది. ఈరోజు విద్యుత్ శ్వేతపత్రంపై చర్చలో ప్రభుత్వం పారిపోయింది. బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయరంగానికి 24గంటల విద్యుత్ ఇచ్చాం. ప్రభుత్వం అసెంబ్లీలో భయపెట్టే ప్రయత్నం చేసింది. మంత్రుల మధ్య సమన్వయం లేదు. కాంగ్రెస్ సభ్యులతో దాడులు దాడులు చేయించే ప్రయత్నం చేశారు. శాసనసభలో లేని వ్యక్తుల గురించి మాట్లాడారు. ఇచ్చిన హామీల నుంచి తప్పించుకునేందుకు శ్వేతపత్రాల పేరుతో ప్రభుత్వం డ్రామాలు ఆడింది. కార్పొరేషన్ల అప్పులు అవే తీర్చుకుంటాయి. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో 3గంటల కంటే ఎక్కువ కరెంటు ఇవ్వడం లేదు. భారాస 24గంటల కరెంట్ ఇచ్చిందని వారికి కడుపుమంట. ఈ రాష్ట్ర ప్రభుత్వం సిగ్గు ఎగ్గు లేకుండా మాట్లాడుతోంది. కర్ణాటకలో రైతులతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చీవాట్లు తింటోంది. దేశంలోని రాష్ట్ర ప్రభుత్వాలకు, అన్ని కార్పొరేషన్‌లకు అప్పులు ఉన్నాయి. భారాస అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన అప్పు పెద్ద లెక్క కాదు.

ప్రతి నిర్ణయం

## పారదర్శకంగా ఉండాల్సిందే

మొదటిపేజీ తరువాయి

తెలియజేసేలా చూడాలన్నారు. ప్రాజెక్టులకు సంబంధించిన అన్ని రకాల లెక్కలు పూర్తిగా ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలను ప్రజలకు తెలియకుండా దాచిపెట్టే ప్రయత్నం చేయొద్దని ఒక వేళ అలా చేస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. ప్రభుత్వంలో ప్రతి నిర్ణయం పారదర్శకంగా ఉండాల్సిందేనన్న ఉద్దేశంతో ప్రతి అంశాన్ని ప్రజలకు విడమరచి చెబుతున్నామన్నారు. ఈ విషయంలో అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండి నిజాలను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రంలోని సాగు నీటి ప్రాజెక్టులకు సంబంధించి పూర్తి స్థాయి నివేదిక అందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎస్ శాంతి కుమారి,రఘునందన్ రావు, శేషాద్రి సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## జీహెచ్ఎంసీ కార్పొరేటర్లతో కేటీఆర్ మీటింగ్

**పార్లమెంట్ఎన్నికల నేపథ్యంలో అలర్ట్**

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:** మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ జీహెచ్ఎంసీ కార్పొరేటర్లతో సమావేశం అయ్యారు. ఓ పక్కన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు వాడివేడిగా కొనసాగుతుంటే.. మరోవైపు పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కేటీఆర్ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ల భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సమావేశంలో కేటీఆర్ కార్పొరేటర్లకు పార్లమెంట్ ఎన్నికలపై దిశానిర్దేశం చేసినట్టు సమాచారం. అసెంబ్లీ సమావేశాల అనంతరం కేటీఆర్ వారితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లోనూ గులాబీ జెండాను ఎగురవేసేందుకు అందరము కలిసికట్టుగా పనిచేయాలని జీహెచ్ఎంసీ కార్పొరేటర్లకు పిలుపు నిచ్చారు. ఎన్నికల ఫలితాల నుంచి నిరాశ పడకుండా ప్రజల తరపున ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేలా బాధ్యతాయుతమైన ప్రతిపక్షపాత్రను నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని, కాంగ్రెస్ పార్టీ అడ్డగోలుగా హామీలు ఇచ్చినా.. వాటిని నెరవేర్చేలా కాంగ్రెస్ ప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకుస్తామని కేటీఆర్ పేర్కొన్నారు.



## టీపీసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డికి సన్మానం

**షాబాద్, విశాల భారతి:**మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘం నాయకులు తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సందర్భంగా.. షాబాద్ మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో టీపీసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్గంటి మధుసూదన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కావలి చంద్రశేఖర్, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు ననాజ్‌పూర్ లింగం ముదిరాజు, సంఘం అధ్యక్షులు కూర వెంకటయ్య ముదిరాజు, సంఘ నాయకులు పాలమాకుల మాసయ్య ముదిరాజ్ ,గంధం గౌరీశ్వర్ ముదిరాజ్, వెంకటయ్య ముదిరాజ్, పోచయ్య ముదిరాజ్, బాలరాజు ముదిరాజు, గంధం శ్రీనివాస్ ముదిరాజు, మిద్యం గూడెం జనార్ధన్ ముదిరాజ్ , యాదగిరి ముదిరాజ్, రాములు ముదిరాజు తదితరులు పాల్గొన్నారు.



## అత్యవసర సేవలు అందిస్తాం

**ఆర్మూర్, విశాల భారతి:**ఆర్మూర్ ఏరియా ఆసుపత్రిలో అత్యవసర సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని సూపరింటెంట్ నాగరాజు తెలిపారు. దేశ వ్యాప్తంగా కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఆర్మూర్ లోని ఏరియా ఆసుపత్రిలో కరోనా కేసులకు సంబంధించి వైద్య సేవలు అందించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందని.. ఇందులో భాగంగా ఆక్సిజన్ సహిత పడకలు, ఐసోలేషన్ వార్డులు, మందులు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ముఖ్య పర్యవేక్షకులు డాక్టర్ నాగరాజు, ఆర్ ఎమ్ ఓ డాక్టర్ ప్రవీణ్ , డాక్టర్ అమృతరామ్ రెడ్డి, డాక్టర్ సుమంత్, డాక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కసిరెడ్డి నారాయణరెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

**నియోజకవర్గ యువ నాయకులు పడకంటి వెంకటేష్**



**కల్వకుర్తి, విశాలభారతి:**కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి మంత్రి పదవి ఇవ్వాలని కల్వకుర్తి నియోజకవర్గ యువ నాయకుడు పడకంటి వెంకటేష్ కోరారు. కల్వకుర్తి ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి జరగాలంటే కసిరెడ్డి నారాయణ రెడ్డి కి మంత్రి పదవి ఇవ్వాలని అన్నారు. కల్వకుర్తి కి సాగునీరు రావడంలో ముఖ్య భూమిక పోషించిన వ్యక్తి విద్యావేత్త కు అవకాశం కల్పిస్తే కల్వకుర్తి నియోజకవర్గం మరింత అభివృద్ధి జరుగుతుందని వెంకటేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.



## అవకాశవాదులను పక్కన పెడదాం

- పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం.
- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగి రెడ్డి

**కూకట్ పల్లి,విశాలభారతి:**కూకట్ పల్లి నియోజకవర్గం అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జిగా బండి రమేష్ బాధ్యతలు అప్పగించిన సంధర్భంగా వారి ఆఫీస్ లో గురువారం స్థానిక నాయకులు నాగి రెడ్డి కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి నిస్వార్థంగా వారి సమయము కేటాయిస్తూ పార్టీ అధికారంలో రావడానికి ఎనలేని కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు, అభిమానులకు పార్టీ కృతజ్ఞతలు తెలిపారు. వారని కంటికి రెప్పలా కాపాడే బాధ్యత మిమీద ఉందని అలాగే ఏ పార్టీ అధికారంలో ఉంటె ఆ పార్టీ లో ఉండే అవకాశ వాదులను ఎంత దూరం పెడితే అంత మంచిదని వారి వల్ల ఏమి ఉపయోగము లేదని, కేవలం పార్టీ అధికారము లోకి వచ్చిన తరువాత మన పంచన చేరిన వారు నమ్మకస్తులు కాదని 2014 కాంగ్రెస్ పార్టీ అధికారము పోయిన తర్వాత అంతకు ముందు తెలంగాణ ఉద్యమ సమయములో కనపడని వారంతా నేడు కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాదే నాని చిలుక పలుకులు పాడేవారు అంతెందుకని, మొన్న మి ఎలక్షన్ లో ఎవరు పని చేసినారు. ఎవరు ఎలక్షన్ కలెక్షన్ అంత కంటే ఎక్కువగా మీకు చెప్పాల్సిన అవసరం లేదు కాబట్టి దాన్ని గమనించి నిర్ణయము తీసుకోవాలని ఆయన కోరారు.

## సాగు చేసిన పంట వివరాలను నమోదు చేయాలి

**జిల్లా వ్యవసాయ అధికారిని గీతారెడ్డి**



**షాబాద్, విశాలభారతి :**యాసంగి సీజన్లో రైతులు తమ పంట పొలాల్లో వేసిన పంటను పక్కాగా వ్యవసాయ అధికారి వద్ద నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారిని గీతారెడ్డి గురువారం షాబాద్ మండలంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలిపారు. వ్యవసాయ విస్తీర్ణ అధికారిని రైతులు వేసిన పంట పొలాలను నిశితంగా పరిశీలించి పంటలను నమోదు చేయాలని తెలిపారు. ఇది నారు పోసుకునే సమయం అని.. ఈ సమయంలో నారమడి గురించి జాగ్రత్తలు తీసుకోవాలని, పొగ మంచు కారణంగా రాత్రి నీరు ఉదయం విడిచిపెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వెంకటేశం, రాజేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది.

**కూకట్ పల్లి అసెంబ్లీ బిజెపి ఇంచార్జి మాధవరం కాంతారావు**



**కూకట్ పల్లి,విశాలభారతి:**పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ప్రతిపక్షాలు ఎలా నాశనం చేస్తున్నాయో చెప్పడానికి రాహుల్ గాంధీ చర్యలే ఉదాహరణ అని కూకట్ పల్లి అసెంబ్లీ బిజెపి ఇంచార్జి మాధవరం కాంతారావు మండిపడ్డారు. పార్లమెంటు సమావేశాల్లో భాగంగా సస్పెండ్ చేయబడిన ప్రతిపక్ష ఎంపీలలో ఒకరైన బెనర్జీ, పార్లమెంట్ మకర ద్వారం వద్ద రాజ్యసభ ఛైర్మన్‌భారత ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధంఖర్ ని ఎగతాళి చేస్తున్న దృశ్యాలను రాహుల్ గాంధీ తన మొబైల్ ఫోన్‌లో రికార్డ్ చేసి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో ఆ వీడియోను పోస్ట్ చేయడాన్ని ఖండిస్తూ గురువారం కూకట్ పల్లి అసెంబ్లీ బిజెపి కార్యాలయం ఎదుట అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తీరుకు నిరసనగా దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాధవరం కాంతారావు మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో ప్రతిపక్ష పార్టీల చర్యలు ముఖ్యంగా టీఎంసీ మరియు కాంగ్రెస్ పార్టీల తీరు యావత్ దేశం సిగ్గుపడేలా చేసిందన్నారు. పార్లమెంట్ నాటకాలకు తావు లేదు. ప్రతిపక్షాలు వ్యతిరేకతను నమోదు చేయడానికి పద్ధతులు ఉంటాయని, కానీ ఉపరాష్ట్రపతిని అవహేళన చేయడం మరియు అవమానించడం ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి తగదని ఆయన అన్నారు. ప్రతిపక్షాలు ప్రజాస్వామ్యాన్ని ఎలా నాశనం చేస్తున్నాయో చెప్పడానికి ఈ చర్యనే ఉదాహరణ అని తెలిపారు. సస్పెండ్ చేయబడిన ప్రతిపక్ష ఎంపీలలో ఒకరైన బెనర్జీ, రాజ్యసభ ఛైర్మన్‌ను ఎగతాళి చేయడం దాన్ని రాహుల్ గాంధీ తన మొబైల్ ఫోన్‌లో చిత్రీకరించడం ఇంతకంటే దౌర్భాగ్యం మరొకటి ఉండదని ఆయన మండిపడ్డారు, రాజ్యసభ ఛైర్మన్‌భారత ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధంఖర్ కి వెంటనే టీఎంసీ మరియు కాంగ్రెస్ పార్టీల సభ్యులు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కాంతారావు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు, తెలంగాణ రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు సూర్యప్రకాష్ రావు, మూసాపేట్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్, సురేందర్ రెడ్డి, మనోహర్, రవి కుమార్ గౌడ్, సత్యమూర్తి, వినోద్ కుమార్ గౌడ్, కొడిచెర్ల వినోద్, శ్రీనివాస్, మల్లేష్, ప్రేమ్ కుమార్, సుగుణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.





## చిగురుమామిడి మండలానికి చేరిన అయోధ్య శ్రీరాముని అక్షింతలు

**చిగురుమామిడి, విశాల భారతి:**కోట్లాది హైందవుల చిరకాల వాంఛ శ్రీరామచంద్రుని జన్మస్థలం అయోధ్యలో రామ మందిరం ప్రతిష్ట మహోత్సవం జనవరి 22న కానుంది. ఈ శుభ సందర్భంలో శ్రీ రామ జన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య రామచంద్రుని పాదాల చెంత పూజలు అందుకుని గురువారం నుస్తులాపూర్ నుండి స్వామివారి కలశం, అక్షింతలు కరపత్రాలు, మంగళ హారతులతో చిగురుమామిడి మండలనికి చేరగా మండల కేంద్రంలోని పాంబండ ఆంజనేయస్వామి దేవాలయంలో భద్రపరిచి హూమేష్ స్వామి చేత పూజాధి కార్యక్రమాలు చేసి హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా రామజన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తిమ్మాపూర్ ఖండ సభ్యులు కొంటు సంపత్ మాట్లాడుతూ అయోధ్యలోని శ్రీరామ మందిరం నుండి వచ్చినటువంటి అక్షింతలు గ్రామాల్లోని భక్తులందరికీ చేరేలా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామోజు రాజ్ కుమార్,జీల రాజు, ముంజ శ్రీకాంత్, శ్రీ మూర్తి రమేష్,బింగి లక్ష్మీనారాయణ, బొల్లి సునీల్, పెనుకుల తిరుపతి, బత్తిని సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



## నియోజకవర్గంలో ప్రభుత్వ పథకాల అమలు చేస్తాం

**కోట నీలిమ**

**విశాలభారతి,సనత్ నగర్ :**సనత్ నగర్ నియోజకవర్గంలో టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ అధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పథకాలను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ సనత్ నగర్ నియోజకవర్గ డివిజన్ అధ్యక్షులు ప్రకటించారు. ఈ మేరకు డాక్టర్ కోట నీలిమను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోటా నీలిమ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీనీ అధికారంలో తీసుకు వచ్చేందుకు కృషిచేసిన నాయకులకు కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రతి కార్యకర్త కృషి చేయడం వల్లే నేడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని వివరించారు. అదే స్థాయిలో రెట్టింపు పనిచేసి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. డివిజన్ అధ్యక్షులు.చిరంజీవి, నరేష్,మల్లికార్జున్,అమనుల్లా ఖాన్,కృష్ణ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు అందే విధంగా చూసే బాధ్యత మనపై ఉందని అన్నారు. డాక్టర్ కోట నీలిమ ఆధ్వర్యంలో అర్హులకు ప్రభుత్వ పథకంను అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## హామీలపై ప్రభుత్వం మాట మార్చింది

- ప్రజలను మభ్యపెట్టిన కాంగ్రెస్
- మోసం చేయడం కాంగ్రెస్ కి వెన్నతో పెట్టిన విద్య
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**విశాల భారతి,హైదరాబాద్:**కాంగ్రెస్ పార్టీ అభయ హస్తం పేరుతో ప్రకటించిన ఆరు గ్యారంటీలను విస్మరిస్తోందని బీఆర్ఎస్ స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకుని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన ఆయన అధికార పార్టీపై విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా హైదరాబాద్లో ప్రియాంక గాంధీ పాల్గొన్న సభలో యూత్ డిక్లరేషన్ ప్రకటించారని, అధికారంలోకి రాగానే ప్రతి నిరుద్యోగికి రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రియాంక గాంధీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి ఇస్తామన్నారన్నారు. ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క నిండు సభలో నిరుద్యోగ భృతి ఇస్తామని తాము ఎక్కడా చెప్పలేదని మాట మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట రుణాలు తీసుకోని వాళ్లు బ్యాంకులకు వెళ్లి రూ.రెండు లక్షలు తీసుకొమ్మని రేవంత్ రెడ్డి ప్రజలకు చెప్పారని, అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న రైతు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. ప్రతి క్వింటాల్కు మద్దతు ధరతో పాటు రూ.5 వందలు బోనస్ ఇస్తామన్నారన్నారు. ఇచ్చిన హామీలను ఇవ్వలేక కాంగ్రెస్ ప్రభుత్వం తప్పించుకుంటుందని దుయ్యబట్టారు. దీనిని బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

## నకిలీ సర్టిఫికెట్స్ తయారు చేస్తున్న ముఠా అరెస్ట్.



**మేడిపల్లి,విశాలభారతి:** బోడుప్పల్ బాలాజీ హిల్స్ కాలనీకి చెందిన రవి శంకర్ రెడ్డి అనే విద్యార్థి CVSR ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేసి ఫెయిల్ అయినాడు , ఆ తరువాత డిస్టన్స్ ఎడ్యుకేషన్ లో భాగంగా బీటెక్ పూర్తి చేయాలని నిర్ణయించుకున్నాడు, తనకు తెలిసిన మిత్రుల ద్వారా ఇతర రాష్ట్రాలలో వేరువేరు యూనివర్సిటీలకు సంబంధించిన సర్టిఫికెట్స్ తయారు చేస్తానని మిత్రులు హామీ ఇచ్చారు. దానిగాను లక్ష రూపాయల నుండి 1,50,000 వరకు ఖర్చు అవుతుందని చెప్పారు.దానికి గాను ఫిర్యాదుదారుడు నిందితులకు 1,50,000 ఇవ్వడం జరిగింది వాళ్లు సర్టిఫికెట్స్ ప్రొవైడ్ చేయడం జరిగింది., తీరా ఒకసారి యూనివర్సిటీ కి సంబంధించిన ఆన్లైన్లో చెక్ చేయగా ఆన్లైన్లో సర్టిఫికెట్స్ కనిపించలేదు, ఆ తర్వాత ఫిర్యాదుదారుడు ఇవి నకిలీ సర్టిఫికెట్స్ గా గుర్తించి తీరా మోసపోయానని పోలీసు వారికి సమాచారం అందించాడు.

## వికసిత్ భారత్ సంకల్పయాత్ర లక్ష్య సాధనలో ప్రజలే ప్రచారకర్తలు

**బీజేపీ కేశంపేట మండల ప్రధానకార్యదర్శి రొల్లు రఘురామ్ గౌడ్.**



**షాద్ నగర్ ,విశాలభారతి:** వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్య సాధనలో ప్రజలే ప్రచారకర్తలని, అర్హత ఉన్న ఏ ఒక్కరూ ప్రభుత్వ పథకం లబ్ధి పొందకుండా మిగిలిపోకూడదనే గొప్ప లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారని బీజేపీ కేశంపేట మండల ప్రధానకార్యదర్శి రొల్లు రఘురామ్ గౌడ్అన్నారు.వికసిత్ భారత్ సంకల్పయాత్ర ఈ నెల 23 శనివారం కేశంపేట మండలానికి రానున్నట్లు ఆరోజు ఉదయం 9గంటలకు నిర్దవెల్లి,మధ్యాన్నం 2గంటల నుండి సంతపూర్, కాకునూరు గ్రామాలకు ప్రచార రథం రానున్నట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేసే క్రమంలో కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించడం, వివిధ పథకాలకు కొత్త లబ్ధిదారులను ఎన్ రోల్ చేయడమే ప్రధాన లక్ష్యంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కొనసాగుతుందన్నారు.ఈ అవకాశం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు



## ఉచిత కరెంట్ ఎప్పుడు ఇస్తారు

- గత ప్రభుత్వం 24 గంటల కరెంట్ ఇవ్వకుండానే అప్పులు చేసింది
- కేంద్రం నుంచి సహాయం అందలేదని మాజీ మంత్రి అబద్దాలు
- బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**నేటి ఆధునిక కాలంలో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు, పాలనను అందించేందుకు అప్పులు చేయాల్సిన అవసరం ఉందని, చేసిన అప్పులను సరైన విధంగా ఉపయోగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటల కరెంట్ ఇవ్వకుండానే అప్పులు చేసిందని మండిపడ్డారు. కరెంట్ను బీఆర్ఎస్ నేతలే కనుగొన్నట్లు మాట్లాడుతున్నారని, బీఆర్ఎస్ ప్రభుత్వం కంటే ముందు విద్యుత్తేలేనట్లు చెప్పుకొస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ధర్నాలు లేవని అందుకే 24 గంటల కరెంట్ ఇచ్చామని మాజీ మంత్రి జగదీశ్రెడ్డి చెప్పడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు హామీ ఇచ్చిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఎప్పటి నుంటి సరఫరా చేస్తారో చెప్పాలని ప్రశ్నించారు. 200 యూనిట్ల కరెంట్ కోసం విద్యుత్ సంస్థలకు రూ.8,820 కోట్లు కావాలని, ఈ డబ్బును ఎక్కడి నుంచి తెస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వ్యవసాయరంగం, నీటిపారుదల ప్రాజెక్టులన్నీ లిఫ్ట్ పథకాలే అయినందున విద్యుత్ మెరుగ్గా ఉండాల్సిందేనని పేర్కొన్నారు. కేంద్రం సాయంతోనే 24 గంటల కరెంట్ వచ్చిందని కేసీఆర్ అన్నారని కానీ కేంద్రం నుంచి సహాయం అందలేదని మాజీ మంత్రి అబద్దాలు చెబుతున్నారని మండిపడ్డారు. బీజేపీని బీఆర్ఎస్ బద్నాం చేస్తోందని దుయ్యబట్టారు. శ్వేతపత్రంలో కేంద్రప్రభుత్వం చేసిన సహాయం ఎక్కడా ప్రస్తావించలేదని పేర్కొన్నారు.

## శ్వేత పత్రాలు సభలో పెట్టి గెలుక్కున్నట్లు ఉంది

- మమ్మల్ని గెలికి మరి తిట్టించుకుంటున్నారు
- ఇరిగేషన్‌పై హరీష్ ఉతికి ఆరేస్తరన్నారు
- ఎమ్మెల్యే దానం నాగేందర్

**విశాలభారతి, హైదరాబాద్ :**శ్వేత పత్రాలు సభలో పెట్టి గెలుక్కున్నట్లు ఉందని తమను గెలికి తిట్టించుకుంటున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యాఖ్యలు చేశారు. గురువారం మీడియాతో నిర్వహిస్తున్న చిట్ చాట్ లో దానం మాట్లాడుతూ.. సభలో ప్రభుత్వం డిఫెన్స్‌లో పడిందన్నారు. పథకాలు ఆలస్యంగా అమలు చేయడానికే శ్వేతపత్రం అని మొదలు పెట్టారన్నారు. ప్రభుత్వం అప్పులు బయటపెడితే భవిషత్ ఇబ్బంది అవుతుందన్నారు. హరీష్ రావు, కేటీఆర్‌కు మంత్రుల కౌంటర్ సరిపోవడం లేదన్నారు. ఇరిగేషన్‌పై హరీష్ ఉతికి ఆరేస్తరన్నారు. మంత్రులు అసలు విషయాలు చెప్పకుండా పైపై వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. రేవంత్ పరిపాలనలో జాగ్రత్తగా వెళుతున్నారని.. సీఎం పదవి రేవంత్ చిరకాల వాంఛ అని అన్నారు. రేవంత్ .. అంత ఈజీగా వదులుకోరన్నారు. లక్ష్యం పెట్టుకుని.. రేవంత్ సీఎం అయ్యారని తెలిపారు. "రెండేళ్ల క్రితమే కాంగ్రెస్ సీనియర్‌లు రిటైర్డ్ అవుతరు. నేనే సీఎం అని చెప్పాడు. మా ఎమ్మెల్యేలు కొందరు ఫ్రస్టేషన్‌లో మాట్లాడుతున్నారు. ఆరు నెలల్లో ప్రభుత్వం పడిపోతుంది అనడం సరికాదు.. కొత్త ప్రభుత్వానికి సమయం ఇవ్వాలని కేసీఆర్ కూడా చెప్పారు" అని ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు.





# తాసిల్దార్ పై చర్యలు తీసుకోవాలి

- సమాచార హక్కు న్యాయ రక్షణ చట్టం 2005 వ్యవస్థాపక అధ్యక్షులు కూనపరెడ్డి సంతోష్

**సూర్యాపేట, విశాలభారతి:** చివ్వేంల మండలం ఎమ్మార్వో గా విధులు నిర్వహిస్తున్నటువంటి ఐతరాజు రంగారావు పై చర్యలు తీసుకోవాలని సమాచార హక్కు న్యాయ రక్షణ చట్టం 2005 వ్యవస్థాపక అధ్యక్షులు కూనపరెడ్డి సంతోష్ అన్నారు. గురువారం ఆ సంఘ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.చివ్వేంల మండల ఎమ్మార్వో గా విధులలో చేరినప్పటి నుండి అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నాడని, అక్రమ వెంచర్లకు లేఔట్లకు పర్మిషన్లు ఇచ్చినారని, 58.59 జీవో ప్రకారం సమాచార హక్కు చట్టం 2005 ద్వారా సమాచారం అడిగితే సమాచారం ఇవ్వకపోగా గత మూడు నెలల నుంచి దాటివేస్తూ ఫోన్లు చేసి బూతులు మాట్లాడుతున్నారన్నారు. 58.59 జీవోలలో అక్రమంగా కొంతమంది అధికార నాయకుల కనుసైగాలలో ఇంటి పట్టాలు. ఇంటి నంబర్లు ఇవ్వడం జరిగినది అన్నారు. ఒక ప్రభుత్వ కార్యాలయంలో పనిచేస్తున్నటువంటి ఒక మహిళ భూమిని ఒక రాజకీయ నాయకుడికి రిజిస్ట్రేషన్ చేసినాడు ఇదేమిటని ప్రశ్నించగా నీకు దిక్కున వాళ్ళకి చెప్పుకో పొమ్మని బెదిరించాడనీ తెలిపారు. అనుమతి లేని వెంచర్లకు పర్మిషన్ ఇచ్చారని అన్నారు. విధులలో చేరినప్పటి నుండి నేటి వరకు కోట్ల రూపాయల ఆస్తులను సంపాదించాడని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు షేక్ మస్తాన్ వలి, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ రాపర్తి సురేష్ పాల్గొన్నారు.



# నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

**సూర్యాపేట, విశాలభారతి:** పార్లమెంట్ సభ్యులను అప్రజాస్వామికంగా సస్పెండ్ చేసిన కేంద్ర బిజెపి ప్రభుత్వ నియంతృత్వ చర్యలకు నిరసనగా డిసెంబర్ 22న దేశవ్యాప్తంగా జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, సిపిఐ జిల్లా నాయకులు బూర వెంకటేశ్వర్లు, సిపిఐ ఎంఎల్ ప్రజా పంద జిల్లా నాయకులు పేర్ల నాగయ్య, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్ర జిల్లా నాయకులు పుల్లూరి సింహాద్రి, బహుజన శ్రామిక రాజ్యం రాష్ట్ర కన్వీనర్ చామకూరి నర్సాగౌడ్ పిలుపునిచ్చారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల పార్లమెంట్ లో చోటు చేసుకున్న పొగ బాంబు ఘటనపై సమగ్ర చర్చ జరగాలని డిమాండ్ చేశారు. ఈ దాడికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరారు. పార్లమెంటుకే రక్షణ లేకపోతే సామాన్య ప్రజలకు రక్షణ ఎలా ఉంటుందని ప్రశ్నించారు. దీనిపై స్పష్టమైన సమాధానం చెప్పకుండా ప్రతిపక్ష పార్టీల నోరు నొక్కిందుకుబిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. బిజెపి వైఖరి ఎండగడుతూ ప్రశ్నిస్తున్న 141 మంది పార్లమెంటు సభ్యులను సస్పెండ్ చెయ్యడాన్ని వామపక్షాలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. దేశ చరిత్రలో ఎప్పుడు లేని విధంగా పార్లమెంటులో బిజెపి నిరంకుశంగా వ్యవహరించడాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు తెలియజేయాలని కోరారు. ఈ పిలుపును జయప్రదం చేయాలని ప్రజాతంత్ర వాదులకు, ప్రజాస్వామ్య శక్తులకు పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, జిల్లా కమిటీ సభ్యులు వీరబోయిన రవి, చిన్నపంగా నరసయ్య,వామపక్ష పార్టీల నాయకులు ఎర్ర అఖిల్,వజా శ్రీనివాస్, భరత్, రామోజీ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యం

- అక్బరుద్దీన్ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి
- సమస్యలపై సభ నిర్వహించేలా ప్రతిపక్ష ఎమ్మెల్యేల తీరు కొనసాగాలి
- మహాజన సమితి ఆదివాసి మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కంగాలరమణకుమారి



**భద్రాచలం, విశాలభారతి:** ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర శీతాకాల అసెంబ్లీ సమావేశాలు జరిగే సమయంలో ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ దళిత ఎమ్మెల్యే పైన చిన్నచూపు పద్ధతి సరైనది కాదని హేళన చేస్తూ మాట్లాడటం సభ అమర్యాదగా భావించబడుతుందని అక్బరుద్దీన్ వెంటనే బేషరత్తుగా దళిత ఎమ్మెల్యేకి క్షమాపణ చెప్పాలని.మహాజన సమితి ఆదివాసి మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షులు కంగాల రమణకుమారి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...విద్యుత్ పైన అసెంబ్లీలో చర్చ జరుగుతుండగా అక్బరుద్దీన్ అనవసరమైన నిందారోపణ చేస్తూ అసెంబ్లీని పక్కదారి పట్టిస్తున్నారని రసాబస చేస్తూ చర్చలు జరక్కుండా అడ్డుకోవటం సరైన విధానం కాదని ఆమె అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క మంత్రులు ఎమ్మెల్యేలు సమస్యల పైన మంచి అవగాహన ఉన్నటువంటి నేతలని తెలంగాణ సమస్యల పైన నిర్దిష్టమైన అవగాహన కలిగి ఉన్నారని ఆమె అన్నారు ప్రతిపక్ష నాయకులు సమస్యల పైన సానుకూలంగా చర్చలు జరిపి ప్రజా శ్రేయస్సు కోసం అసెంబ్లీ నడిపే విధంగా సహకరించాలని సమయాన్ని వృథా చేసి ప్రజా సమస్యలను పక్కదారి పట్టే విధంగా చేయొద్దని ఆమె తెలిపారు. ఇప్పుడే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా సమస్యల పైన కసరత్తు చేస్తున్నారని ప్రజాపాలన కొనసాగే విధంగా చేసే ప్రయత్నంలో ప్రతిపక్ష నేతలు సహకరించి తెలంగాణ అభివృద్ధికి పాటుపడాలని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



## ఎంపీ టికెట్ చెవిటి
# వెంకన్న యాదవ్ కి కేటాయించాలి

**నూతనకల్, విశాల భారతి:** భువనగిరి పార్లమెంట్ ఎంపీ టికెట్ చెవిటి వెంకన్న యాదవ్ కి కేటాయించాలని బీసీ విద్యార్థి, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్ కోరారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, రైతుబిడ్డ, కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని దశాబ్దాల కాలంగా పార్టీ నిర్మాణం కోసం, ప్రాణాలను సైతం అడ్డుపెట్టి నిరంతరం ప్రజా సమస్యల కొరకై, ప్రజల అభివృద్ధి, లక్ష్యంగా పనిచేస్తున్న బహుజన బిడ్డ చెవిటి వెంకన్న యాదవ్ కి భువనగిరి ఎంపీ టికెట్ కేటాయించాలని, కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని కోరుతున్నామని,గత అసెంబ్లీ ఎన్నికలలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఉదయపూర్ డిక్లరేషన్ ను కాదని 12 అసెంబ్లీ స్థానాలకు గాను ఆలేరు అసెంబ్లీ స్థానాన్ని మాత్రమే బీసీలకు కేటాయించడం జరిగిందన్నారు. కావున పార్లమెంటు ఎలక్షన్లలో ఈ తప్పు జరగకుండా బీసీ బిడ్డ చెవిటి వెంకన్న యాదవ్ కి టికెట్ కేటాయించాలని పార్టీని నమ్ముకుని పనిచేసే వారికి గుర్తింపు ఇవ్వాలని నూతనకల్ మండల కేంద్రంలో జరిగిన బిసి సదస్సులో తీర్మానం చేశామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం బీసీలను గుర్తించి తగిన న్యాయం చేయాలని ఈ సందర్భంగా పలువురు నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో నెల్లుట్ల మహేష్, బంటు బద్రి, చెవిటి సూర్య, ఇరుగు కిరణ్ తదితర బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## కిషోర్ కుమార్
# నోరు అదుపులో పెట్టుకోవాలి

- కాంగ్రెస్ మండల అధ్యక్షులు సమరం రెడ్డి
- రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి



**శాలిగౌరారం, విశాలభారతి:** తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి మండలంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ బుధవారం అహంకారపూరితమైన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోని, నోరు అదుపులో పెట్టుకోకుండా ఇష్టానుసారంగా మాట్లాడితే నియోజకవర్గం ప్రజలు తరిమేస్తారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సమరం రెడ్డి స్థానిక జడ్పిటిసి ఎర్ర రణీల యాదగిరి అన్నారు.ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,స్థానిక ఎమ్మెల్యే మందుల సామెలు మీద మాజీ శాసనసభ్యులు గాదరి కిషోర్ కుమార్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తుంగతుర్తి నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా మధ్యంతర ఎలక్షన్లు వస్తాయని, మళ్లీ నేనే ఎమ్మెల్యే అని మాట్లాడడం ఆయన నియంతృత్వానికి నిదర్శనమని,ఇది తుంగతుర్తి ప్రజల తీర్పును అవమానించడమేనని మధ్యంత్ర ఎలక్షన్లు వస్తాయి అని మాట్లాడడం వెనుక మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ కుట్రలేందో బహిర్గతం కావాలన్నారు. ఎమ్మెల్యే మందుల సామేలుకు ఎలాంటి హాని జరిగిన మాజీ ఎమ్మెల్యే ఆయన అనుచరులు బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పాకాల సతీష్,ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు లొడంగి మహేష్ ఉపాధ్యక్షులు కట్లకుంట్ల రమేష్ మంగదుడ్ల శ్రీనివాస్ యాదవ్,సోషల్ మీడియా కన్వీనర్ అన్నెబొయిన అనిల్, గుత్తా రవీందర్ రెడ్డి, కొక సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# పబ్లిక్ క్లబ్ కార్యదర్శి ,కోశాధికారులపై విచారణ చేయాలి

- సాంస్కృతిక కార్యక్రమాల పేరిట నిధుల స్వాహా
- సమగ్ర విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలి
- సీనియర్ సభ్యులు నూకల సుదర్శన్ రెడ్డి, బొల్లెద్దు దశరథ

**సూర్యాపేట, విశాలభారతి:** పట్టణంలోని పబ్లిక్ క్లబ్ కార్యవర్గంపై సమగ్ర విచారణ చేసి కార్యదర్శి, కోశాధికారులపై చర్యలు తీసుకోవాలని సీనియర్ సభ్యులు నూకల సుదర్శన్ రెడ్డి,బొల్లెద్దు దశరథ కోరారు. సూర్యాపేట పబ్లిక్ క్లబ్ నందు గత కొన్ని సంవత్సరాల నుండి జరుగుతున్న అక్రమాలు, నిధుల దుర్వినియోగం, నిధుల స్వాహాపై విచారణ జరపాలని, పబ్లిక్ క్లబ్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయాలని, ప్రస్తుత కమిటీని రద్దు చేసి, నూతన కమిటీ ని నియమించాలని కోరుతూ గురువారం నాడు పబ్లిక్ క్లబ్ గౌరవ అధ్యక్షులు,సూర్యాపేట ఆర్డీవో వీరబ్రహ్మ చారి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పబ్లిక్ క్లబ్ కు ప్రతి నెలా దుకాణాల అద్దె, ఆడిటోరియం అద్దెల ద్వారా లక్షలాది రూపాయల ఆదాయం వస్తుందని, ప్రస్తుత కార్యదర్శి అక్రమాలకు పాల్పడ్డారని, నిధులను స్వాహా చేయడంతో పాటు, క్లబ్ కు సంబంధం లేని రంగస్థల పద్యాలు,భరత నాట్యాలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ,లక్షలాది రూపాయలు స్వాహా చేశారని అన్నారు.12 నెలలకు ఒకసారి సర్వసభ్య సమావేశం పెట్టాలని, ప్రతి నెల క్లబ్ యొక్క ఆదాయ,వ్యయాలు క్లబ్ సభ్యులకు తెలియజేస్తూ నోటిస్ బోర్డులో పెట్టవలసి వుందని, ప్రతి నెల కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేయాలని తెలిపారు. కాని ప్రస్తుత కార్యదర్శి ఎటువంటి సమావేశాలు పెట్టకుండా, ఆదాయం,ఖర్చులు చెప్పకుండా ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తూ,నిధుల దుర్వినియోగం చేశారని అన్నారు. ప్రస్తుత కమిటీని రద్దుచేసి, నూతన కమిటీ ఏర్పాటు చేయాలని,క్లబ్ నుండి అక్రమంగా డబ్బులు స్వాహా చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సభ్యులు ఎల్గూరి చంటి బాబు,శనగాని రాంబాబు గౌడ్,చెంచల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



# గాదరి కిషోర్ కుమార్ నోరు అదుపులో పెట్టుకో

**తుంగతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంగరి గోవర్ధన్**

**తుంగతుర్తి, విశాలభారతి:** మండల కేంద్రంలోని మాజీ మంత్రి రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గాదరి కిషోర్ తక్షణమే తుంగతుర్తి ప్రజానీకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. నిన్న జరిగిన బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ ఓటమిని జీర్ణించుకోలేక మతి భ్రమించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై మరియు స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ పై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు .ఈ ప్రాంతంలో ఇసుక మాఫియా, హత్య రాజకీయాలు, భూ కబ్జాలు, నయీం ముఠాతో సంబంధాలు, దొంగ నోట్ల వ్యవహారం, అక్రమ స్కాములు చేసింది మీరని, ఇకనైన నాలుక అదుపులో పెట్టుకొని సంస్కారంగా మాట్లాడాలని లేని పక్షంలో కాంగ్రెస్ నాయకులు నిన్ను నియోజకవర్గంలో అడుగు పెట్టనీయరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు తిరుమల ప్రగడ కిషన్ రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఓరుగంటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## వేములవాడ గౌడ
# సత్రం నిర్మాణానికి 30 లక్షల విరాళం.

**ముషీరాబాద్,విశాలభారతి:** తెలంగాణ గౌడ సంఘాల సమన్వయ కమిటీ వేములవాడ లో గౌడ సత్రం నిర్మాణానికి 30 లక్షల విరాళాన్ని ప్రకటించింది. అందులో భాగంగా గురువారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా గౌడ సత్రం నిర్మాణం పర్యవేక్షణ పుంజల హరిచరణ్ గౌడ్ కు గౌడ సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజ్ గౌడ్ 11 లక్షల రూపాయలను డిడి రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఆయిలి వెంకన్న గౌడ్, గౌడ సంఘం సీనియర్ నాయకులు ప్రేమ్ దాస్ గౌడ్, గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి బాలగౌని వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# కోవిడ్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ ప్రియాంక అల**

**భద్రాద్రి కొత్తగూడెం, విశాలభారతి :** కలెక్టర్ చాంబర్ లో కోవిడ్ ముందస్తు నియంత్రణ చర్యలపై వైద్యశాఖ అధికారులతో నియంత్రణ చర్యలపై సమీక్షించారు. జిల్లాలో కోవిడ్ వ్యాప్తి చెందకుండా ప్రజలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో మే నెల నుంచి కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదు కాలేదన్నారు. కొవిడ్ లక్షణాలున్నవారికి పరీక్షలు చేయాలని చెప్పారు. ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రు ల్లో కొవిడ్ బెడ్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కొవిడ్ నియంత్రణకు డ్రగ్స్,ఆక్సిజన్, వెంటిలేటర్లు,పీపీఈ కిట్లు,మాస్క్ లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ముక్కోటి ఉత్సవాలకు వచ్చే భక్తులు కోవిడ్ నిబంధనలు పాటించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య అధికారి శిరీష, మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకి మెరుగైన సేవలందించాలి

- సాధ్యమైనంత త్వరగా పెండింగ్ కేసులు క్లియర్ చేయాలి
- ఫోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేయాలి
- జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలి
- నేర సమీక్షా సమావేశంలో స్పీ అపూర్వ రావు



**నల్లగొండ, విశాలభారతి:** ప్రజలకు అందుబాటులో ఉంటూ సంవర్ధవంత మైన సేవలు అందజేస్తు సత్వర న్యాయం చేసేలా కృషి చేయాలని జిల్లా యస్.పి కె.అపూర్వరావు ఐపిఎస్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారులతో నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా యస్.పి అపూర్వ రావు మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి అడిగి, గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ తో పూర్తి పారదర్శకంగా చేయాలి అన్నారు. కేసు నమోదు నుండి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకుషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలని ఫోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. ప్రతి అధికారికి పూర్తి ఇన్వెస్టిగేషన్, స్టేషన్ మేనేజ్మెంట్ తెలిసి ఉండాలని అవసరమైతే సంబంధిత న్యాయమూర్తులను స్వయంగా కలిసి కేసుల పరిష్కారానికి మరింత చొరవ చూపాలని సూచించారు. దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని,పెండింగ్ కేసుల విషయంలో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, కొత్త కేసులతో పాటు చాలా కాలంగా పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షించడం ద్వారా కేసుల సంఖ్య తగ్గించే దిశగా అన్ని స్థాయిల అధికారులు పని చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ చేపట్టిన 16 ఫంక్షనల్ వర్టికల్స్ రిసెప్షన్, క్రైమ్ వర్టికల్, టెక్ టీమ్, స్టేషన్ రైటర్, కోర్టు డ్యూటీ ఆఫీసర్, తదితర వర్టికల్స్ పటిష్ట అమలు పరుస్తూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సంవర్దవంత మైన సేవలు అందజేస్తు సత్వర న్యాయం చేసేలా కృషి చేయాలని అన్నారు. కమ్యునిటీ పోలిసింగ్ ద్వారా గ్రామాలలో సిసిటీవి లు ప్రాముఖ్యత అవగాహన కల్పిస్తూ ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. అదే విధంగా మహిళల భద్రతకు మరింత భరోసా కల్పిస్తూ వారి రక్షణ ప్రధాన ధ్యేయంగా నాణ్యమైన,సత్వర సేవలు అందించాలన్నారు. సైబర్ క్రైమ్, డయల్ 100వాటి వినియోగంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో నల్లగొండ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి, మిర్యాలగూడ డిఎస్పీ వెంకటగిరి, డి.సి.ఆర్.బి డిఎస్పీ సైదా నాయక్, సి.ఐ లు మరియు యస్.ఐ లు పాల్గొన్నారు.



# ఘనంగా సీఎం జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు

**భద్రాచలం, విశాల భారతి:** ఎమ్మెల్సీ అనంత బాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మి సూచనల మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామపంచాయతీలో వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు పురుషోత్తపట్నం, ప్రజా ప్రతినిధులు, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కేక్ కట్ చేసి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. వైయస్ జగన్మోహన్ రెడ్డి 2019 కి ముందు తాను చేసిన 3648 కిలోమీటర్ల పాదయాత్రలో ప్రజల కష్టాలను చూసి నవరత్నాలు అనే సంక్షేమ పథకాలు తీసుకురావడం జరిగిందని తెలిపారు, అంతేకాకుండా మేనిఫెస్టోలో లేని ఎన్నో సంక్షేమ పథకాలను కూడా ప్రజల కోసం తీసుకురావడం జరిగిందని తెలిపారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థలను నిర్మించి విజయవంతంగా నడుస్తున్న నేపథ్యంలో, ఇతర రాష్ట్రాల వాళ్లు కూడా మన రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకొని ఈ గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థలను తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. అన్నా అంటే నేనున్నా అంటూ వెన్ను అంటే ఉండి మమ్మల్ని ప్రోత్సహించే, మా ఆశాజ్యోతి మా జగనన్న అని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి, పురుషోత్తపట్నం సర్పంచ్ బుద్ధ ఆదినారాయణ, వైఎస్ఆర్సిపి జిల్లా కార్యదర్శి, దామెర్ల రేవతి, అన్నెం జయచంద్రారెడ్డి, భోగాల వీరారెడ్డి, కుందూరు రామిరెడ్డి, బైరెడ్డి నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా సెంట్రల్ బ్యాంక్ అఫ్ ఇండియా వార్షికోత్సవం

**సూర్యాపేట, విశాలభారతి:** సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 113 వ వ్యవస్థాపక దినోత్సవంను సూర్యాపేట బ్రాంచ్ లో ఘనంగా నిర్వహించారు. గురువారం బ్యాంక్ మేనేజర్ దారావత్ బీముడు ఆధ్వర్యంలో ఈ ఉత్సావాలు ఖాతాదారుల సమక్షంలో కేక్ కట్ చేసి నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ బీముడు మాట్లాడుతూ సెంట్రల్ బ్యాంక్ అఫ్ ఇండియా భారతీయుల చే స్థాపించంపబడిన మొదటి బ్యాంక్ గా చరిత్రలో నిలిచిందన్నారు. గత 113సంవత్సరాలనుండి ఖాతాదారులకు విశిష్టమైన సేవలు అందిస్తూ నూతన పథకాలను తీసుకు రావడం జరిగిందని అన్నారు. సూర్యాపేట పట్టణంలో ఈ బ్యాక్ ను స్థాపించి 10సంవత్సరాలను పూర్తి చేసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో క్యాషియర్ సురేఖ ఖాతాదారులు టి శ్రీనివాసరావు ఎలిమినేటి పుష్పలత, టీ మోహన్, సి హెచ్ శ్రీనివాస్ రావు,బి సురేష్ , జానకి రాములు తదితరులు పాలుగోన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
www.vishalabharati.com
epaper:vishalabharati.com
జనరల్ న్యూస్
vishalabharathi Telugu Daily
5
శుక్రవారం,
22.12. 2023
హైదరాబాద్



# వృద్ధులకు వస్తువుల పంపిణీ

**తొర్రూర్, విశాల భారతి:** అనాధ వృద్ధులను చేరదీసి సొంత కొడుకుల కంటే ఎక్కువగా ఆదరించి వారికి సేవలు చేస్తున్న సంస్థ బాలవికాస సంస్థ అని వారి సేవలు మరువలేని వని మున్సిపాలిటీ చైర్మన్ మంగళంపల్లి రామచంద్రయ్య, జడ్పిటిసి మంగళంపల్లి శ్రీనివాస్ అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ లో బాలవికాస సేవా సంస్థ ఆధ్వర్యంలో అనాధ వృద్ధులకు నిత్యవసర వస్తువులైన బట్టలు,బియ్యం పంపిణీని , వృద్ధులకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఇచ్చిన దుస్తువులను వారు పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో 50 మంది వృద్ధులు పాల్గొనగా వారికి సరుకులతో పాటు పెట్టెలు ఇచ్చి భోజనాలు పెట్టి 1,50,000 ఖర్చు పెట్టడం జరిగిందని ,మరో వంద మందికి ఎండి అస్మాది బేగం భోజన సదుపాయం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో తొర్రూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సోమ రాజశేఖర్, దాతలు శ్రీ మాత , ధనలక్ష్మి శ్రీధర్ , దేవేందర్, బాలవికాస సెంటర్ నెల్లూరు రామ, ఎంసీ మద్దెల రమ, శైలజ, ఎం శేఖా, రమేష్, కమిటీ లీడర్లు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు

**నూతనకల్, విశాల భారతి:** తుంగతుర్తి నియోజకవర్గ శాసన సభ సభ్యుడిగా అఖండ విజయాన్ని నమోదు చేసిన మందుల సామేలుని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తుంగతుర్తిలో పరాయి పాలన పోయి, స్వపరిపాలన వచ్చిందని, ఇసుక మాఫియాని ఈ సరిహద్దుల నుండి తరిమివేసామని, రాబోయే కాలంలో మంచి పరిపాలన అందిస్తామని తెలిపారు. చిల్పకుంట్ల గ్రామంలో 1012 ఓట్ల మెజార్టీని అందించిన గ్రామ ప్రజలకు ఎమ్మెల్యే సామెల్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిల్పకుంట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు బాణాల సుదర్శన్ రెడ్డి, బత్తుల నాగమల్లు, బత్తుల రమేష్ ,బికి శ్రీనాథ్ ,కుసు వెంకన్న , సిపిఐ నేత తట్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



# బోధనలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

**జిల్లా విద్యాధికారి ఎం. వెంకటేశ్వర చారి**

**మణుగూరు, విశాల భారతి:** జిల్లాలోని మణుగూరు, అశ్వాపురం మండలాలలో పలు పాఠశాలలను గురువారం నాడు జిల్లా విద్యాధికారి ఎం. వెంకటేశ్వర చారి ఆకస్మికంగా సందర్శించారు. బోధనలో, మధ్యాహ్నం భోజనం నిర్వహణలో,ఎఫ్ అర్ ఎస్ అటెండన్స్ లో నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిన ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసు లను ఇవ్వాలని మండల విద్యాధికారిని ఆదేశించారు. మణుగూరు మండలం లోని సమితి సింగారం, ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నం 1గం. వరకు మధ్యాహ్న భోజనం అందించక పోవడం, పి. టి ఎం సమావేశాలను నిర్వహించకుండానే , నిర్వహించినట్టు మినిట్స్ రాయడం, హాజరు శాతం చాలా తక్కువగా ఉండటం పట్ల జిల్లా విద్యాధికారి ఆగ్రహం వ్యక్తం చేస్తూ, సదరు పాఠశాలలో ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులను ఇవ్వమని మండల విద్యాధికారిని ఆదేశించారు. అదేవిధంగా మణుగూరు మండలంలోని శ్రీ సాయి నగర్ ప్రాథమిక పాఠశాలను కూడా సందర్శించి పిల్లల్లో లభ్యసన సామర్థ్యాలను పరిశీలించి, వాటిని పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రాథమికోన్నత పాఠశాల గొల్లగూడెం నందు నిర్వహించబడుతున్న దివ్యాంగ పిల్లల సర్వే ను కూడా పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ జిల్లా సెక్టోరల్ అధికారులు యస్. కె. సైదులు, ఎన్. సతీష్ కుమార్, మండల విద్యాధికారి వీరాస్వామి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



# కంపెనీ విస్తరణ పనులు ఆపండి

**చిట్యాల, విశాలభారతి:** ఎంపిఎల్ కంపెనీ విస్తరణ పనులు ఆపివేయాలని వెలిమినేడు గొర్రెల మేకల పెంపకదారుల సంఘం చైర్మన్ బైకని నాగరాజు అన్నారు. నల్లగొండ జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారి సురేష్ బాబు కి ఈ సందర్భంగా వినతిపత్రంఅందజేశారు. అనంతరం నాగరాజు యాదవ్ మాట్లాడుతూ గ్రామంలోని సర్వేనెంబర్ 295, 299, 300 లో గల 32 ఎకరాల విస్తీర్ణంలో ఎం పి ఎల్ స్పాంజ్ ఐరన్ కంపెనీ జనవరి 19 రోజున ప్రజాభిప్రాయ సేకరణను ప్రకటించారు. దీని ఉత్పత్తి ప్రస్తుతం ఉన్న 60000 టిపిఎ నుండి లక్ష ఇరవై ఆరు వేల టిపిఎ వరకు 412 కోట్లతో ప్రాజెక్టు పెట్టడం వల్ల వెలిమినేడు గ్రామంతో పాటు చుట్టుపక్కల 10 గ్రామాల ప్రజలు దుమ్ముదూలి మరియు వాయు కాలుష్యం జల కాలుష్యం జరుగుతుంది. కావున ప్రజలు జంతువులు గొర్రెలు బర్రెలు తీవ్ర అనారోగ్యానికి గురి కావడం జరుగుతాయి కావున ఈ ప్రజా సేకరణను ఎట్టి పరిస్థితిలో జరగకుండా అడ్డుకుంటామని మరియు అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షలు చేస్తామని మా యొక్క ప్రాణాలను సైతం పక్కకు పెట్టి ఈ యొక్క ఎం పి ఎల్ కంపెనీ విస్తరణను జరగకుండా అడ్డుకుంటామని తెలియజేస్తున్నామన్నారు. భారత రాజ్యాంగం కల్పించినటు వంటి జీవించే హక్కులను కాలరాస్తూ అక్రమంగా ఊరికి 500 మీటర్ల దూరంలో ఉన్నటువంటి ఎంపిఎల్ కంపెనీని ఇక్కడ నుండి దూర ప్రాంతాలకు తరలించాలని కోరుచున్నామని లేదంటే హైవేని దిగ్బంధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏర్పుల శ్రీశైలం దుర్గం లింగస్వామి, మద్యపురం శ్రీశైలం దేశబోయిన వెంకటేష్ బైకానీ స్వామి, పెంభల మల్లేష్ దోటి అంజయ్య పాల్గొన్నారు.

# విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ను ఏర్పాటు చేయాలి.

- వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయించాలి.
- కట్టె కోత మిషన్ల లైసెన్లను పునర్దించాలి.
- సీఎం రేవంత్ రెడ్డిని కలిసి కోరిన తెలంగాణ బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి..



**ముషీరాబాద్,విశాలభారతి:**రాష్ట్ర ప్రభుత్వం అటవీ శాఖ మినయించిన 44 రకాల కర్రలను విశ్వకర్మలు వ్యవసాయదారుల కోసం పనిచేస్తూ వాడుతున్నారని తెలంగాణ బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి అన్నారు. అయితే గత ప్రభుత్వం కట్టె కోత మిషన్లను రద్దు చేసిందని తిరిగి వాటికి మినాయింపు ఇచ్చి రైతులు పనిముట్ల కోసం విశ్వకర్మల ఉపాధి కోసం పునర్దించాలని కోరారు. ఈ మేరకు తెలంగాణ బీసీ కుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కుందారం గణేష్ చారి నేతృతంలో విశ్వకర్మలు హైదరాబాదులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కుందారం గణేష్ చారి మాట్లాడుతూ రాష్ట్రంలోని 20 లక్షల మంది విశ్వబ్రాహ్మణుల సాధక బాధకాలు ముఖ్యమంత్రికి వివరించామని తెలిపారు. విశ్వకర్మల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ తక్షణమే ఏర్పాటు చేసి 1000కోట్ల రూపాయల బడ్జెట్ను కేటాయించి ఆదుకోవాలని కోరారు. అంతేకాకుండా పాలక మండలి ఏర్పాటు చేసి విశ్వబ్రాహ్మణులకు ఎమ్మెల్సీ కార్పొరేషన్ చైర్మన్ డైరెక్టర్లుగా నామినేట్ చేయాలన్నారు. గీత, నేత కార్మికులకు మాదిరిగా విశ్వబ్రాహ్మణులకు కూడా పెన్షన్ విధానం వర్తింప చేయాలని కోరారు. రాష్ట్రంలో కమ్మరి వడ్రంగి లపై ఫారెస్ట్ అధికారులు జరుపుతున్న దౌర్జన్యాలను వెంటనే అరికట్టాలని, దొంగ బంగారం పేరుతో స్వర్ణకారులపై పోలీసు వేధింపులను ఆపివేయాలన్నారు. అలానే తెలంగాణకు దిక్సూచి లైనా ప్రొఫెసర్ జయశంకర్, శ్రీకాంత్ చారి విగ్రహాలను ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసి జయంతి వర్ధంతిని అధికారికంగా ప్రభుత్వం నిర్వహించాలని కోరారు. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసి పడడానికి కారణమైన అమరుడు శ్రీకాంత్ చారి తల్లికి లేదా తండ్రికి ఎమ్మెల్సీ నామినేటెడ్ పదవితో పాటు ఇతూ విషయాలు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. సీఎం సానుకూలంగా స్పందించారని సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



# ఉచిత విద్యా,ఉపాధి కల్పన కై జనవరి 12న ఛలో ఢిల్లీ

**చలో ఢిల్లీ,పార్లమెంట్ పోస్టర్ రిలీజ్..**

**హైదరాబాద్,విశాలభారతి:** అందరికీ ఉచిత విద్య ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ తో పాటు 16 విద్యార్థి సంఘాలు జనవరి 12న చలో పార్లమెంట్ నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లెనిన్ గువేరా, అశోక్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కార్యాలయంలో అధ్యక్షులు లెనిన్ గువేరా అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు.దేశంలో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునేందుకు, అందరికీ ఉచిత విద్య,ఉపాధి కల్పించాలని జనవరి 12వ తేదీన చలో పార్లమెంట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర బడ్జెట్లో విద్యారంగానికి 3 శాతం నిధులు మాత్రమే కేటాయిస్తున్నారని, ఈ బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ప్రభుత్వ విద్యా సంస్థలకు సరిపడా నిధులు కేటాయించాలని కోరారు. దేశంలో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగం తీవ్రంగా పెరిగిందనీ, సంవత్సరానికి 10 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న కేంద్ర ప్రభుత్వ హామీ ఏమైందని ప్రశ్నించారు. కేంద్ర విశ్వవిద్యాలయాల్లో నిరసనలు వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని, జరిమానాలు విధిస్తున్నారనీ, ప్రశ్నించే గొంతుకులను నిర్బంధించే చర్యలు ప్రజాస్వామ్యంలో ఉండరాదన్నారు. దేశంలో అత్యంత ప్రతిష్టాత్మక జవహార్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో నిరసన తెలిపితే 20వేల రూపాయల జరిమానా విధిస్తామని వైస్ ఛాన్సలర్ సర్కులర్ జారీ చేయడం అప్రజాస్వామికమన్నారు. నూతన జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా ఎన్టిఏ ద్వారా అన్ని రకాల జాతీయ స్థాయి పోటీ పరీక్షలను కేంద్రమే నిర్వహించాలని చూస్తుందని తెలిపారు. జాతీయ స్థాయి పోటీ పరీక్షలన్నీ ఎన్టిఏ నిర్వహించడం ద్వారా అధికార కేంద్రీకృతమై తమిళనాడులో జాతీయస్థాయి మెడికల్ ఎంట్రన్స్ టెస్ట్ లో అవకతవకలు జరిగిన మాదిరిగా ఇతర పోటీ పరీక్షల్లో జరిగే అవకాశం ఉందన్నారు. ఎన్ టిఏ అనే ఒకే గొడుగు కింద జాతీయ స్థాయి పోటీ పరీక్షలు అన్నీ నిర్వహించడం సరైన నిర్ణయం కాదన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ బిసి విద్యార్థులకు ఇచ్చే జాతీయస్థాయి ఫెలోషిప్ లు కోత విధిస్తున్నారని, ఈ కారణం చేతనే జాతీయ విశ్వవిద్యాలయాల్లో విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. అందరికీ ఉచిత విద్య,అందరికీ ఉపాధి కల్పించాలని చేపట్టబోయే చలో పార్లమెంట్ కార్యక్రమానికి ప్రజాస్వామిక వాదులు అందరూ మద్దతు ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగేందర్, వీరేందర్, సునీల్, ప్రశాంత్, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ విద్యుత్ ఉద్యోగుల డివిజన్ కమిటీ ఎన్నిక



**తొర్రూరు, విశాల భారతి:**బీసీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో నూతన కమిటీని ప్రకటించారు.సంఘ డివిజన్ అధ్యక్షునిగా సలుగు నరసయ్య, కార్యనిర్వాహక అధ్యక్షునిగా పి. వంశీ, ఉపాధ్యక్షుడు మచ్చ సునీల్ , కార్యదర్శిగా బి. మేత్రాం, ఆర్థిక కార్యదర్శిగా తేలిక యాకన్న, కార్యనిర్వాహక కార్యదర్శిగా కె. అశోక్, డివిజన్ సలహాదారుగా కోటి లింగంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్పీడీసీఎల్ కంపెనీ కార్యదర్శి నీలారపు రాజేందర్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రంగు సత్యనారాయణల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ విద్యుత్ శాఖలో బీసీలకు బదిలీలు పదోన్నతులలో జరుగుతున్న అన్యాయాలపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. బీసీలు ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయని, బీసీ విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అందరూ ఏకం కావాలన్నారు. నూతన కమిటీ ప్రతినిధులు బీసీల సమస్యలపై నిలబడాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కె. బోజాలు, ఏఓ సంతోష్ కుమార్ ,మచ్చ ఐలయ్య, ఎం. రమేష్, ఆర్ సత్యనారాయణ, ఎన్. ప్రసాద్, శామకూరి శ్రీనివాస్, దామోదర్, పాల్గొన్నారు.

# కోవిడ్ విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి

**తహసీల్దార్ వీర భద్ర ప్రసాద్**



**పినపాక ,విశాలభారతి:** జ్వరం, జలుబు, గొంతు సమస్యలు పెరుగుతున్న ఈ తరుణంలో కరోనా మళ్లీ వ్యాప్తి చెందుతున్నదని వైద్య, ఆరోగ్య శాఖ హెచ్చరికలు చేయడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పినపాక తాసిల్దార్ వీరభద్ర ప్రసాద్ తెలియజేశారు. గురువారం పినపాక తాసిల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కరోనాలో కొత్త వేరియంట్ (జేఎన్1) కారణంగా కేసులు పెరుగుతున్నాయని, మాస్కులు ధరించి అందరూ జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వం సూచించిందన్నారు. లేకపోతే జరిమానా విధిస్తామని తాజాగా ఆదేశాలిచ్చిందని తెలిపారు. చలితో వచ్చిన జ్వరం, జబులుతో ఇబ్బంది పడుతున్న వారు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. కరోనా తాజా వ్యాప్తి కారణంగా 10 ఏండ్ల లోపు వారు, 60 ఏండ్లు దాటిన వారు, గర్భిణులు అత్యవరమైతే తప్ప బయటికి రావద్దని వైద్య, ఆరోగ్య శాఖ సూచించిందని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మాస్కు ధరించాలని, వీలైనన్ని ఎక్కువసార్లు చేతులు కడుక్కోవాలని, తప్పనిసరైతేనే ప్రయాణాలు చేయాలని పేర్కొన్నారు. జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, శ్వాసలో ఇబ్బందులు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఇంటి లోపల వేడి వాతావరణం ఉండేలా చూసుకోవాలని, వీలైనంతగా పిల్లలు, వృద్ధులు ఉన్ని దుస్తులు ధరించాలని సూచించింది. శానిటైజర్ తో చేతులు శుభ్రం చేసుకోవాలని తెలియజేశారు. వ్యక్తిగత దూరాన్ని పాటించాలన్నారు.



# మల్లేపల్లిలో కంపెనీల మాయాజాలం

- మణుగూరు సింగరేణిలో ఇతర రాష్ట్రాల కార్మికులే అధికం
- స్థానికులకు ఉపాధి లేక ఇతర ప్రాంతాలకు వలసలు
- స్థానికులకు ఉపాధి కల్పించాలని ఎస్ ఓ 2 జిఏం కు వినతిపత్రం అందజేత

**మణుగూరు, విశాల భారతి:** సిగలో నల్ల బంగారం ఉందన్న పేరే కానీ , స్థానిక నిరుద్యోగులకు మాత్రం బూడిదనే మిగులుస్తుందని, ఇక్కడ నిరుద్యోగులు మణుగూరు సింగరేణి కంపెనీలో ఉపాధి అవకాశాలు లేక ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని మణుగూరుకు చెందిన సామాజిక కార్యకర్త అడ్వకేట్ కర్నె రవి అన్నారు. మణుగూరు సింగరేణిలో స్థానిక నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయాలపై ఆయన సింగరేణి ఎస్ ఓ 2 జిఎంని కలిసి, స్థానికులకు 80 శాతం ఉద్యోగాలు కల్పించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం కర్నే రవి మాట్లాడుతూ మణుగూరు మల్లేపల్లి ఓసి, మహాలక్ష్మి ప్రైవేట్ ఓబీ కంపెనీలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు 80 శాతం ఉన్నారని, స్థానిక కార్మికులు 20 శాతం మాత్రమే ఉన్నారని, మధ్యాహ్నం షిఫ్ట్ కూడా ఇతర రాష్ట్రాల వారికి మాత్రమే కేటాయిస్తూ స్థానిక కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. మల్లెపల్లి ఓసి మహాలక్ష్మి ప్రైవేట్ ఓబీ కంపెనీలో 851 మంది కార్మికులు పనిచేస్తుంటే అందులో లోకల్ వారు కేవలం 282 మాత్రమే ఉన్నారని, పీకే ఓసి, మణుగూరు ఓసి 4 సెక్షన్ లో దుర్గా ప్రైవేట్ ఓబీ కంపెనీలో 545 మంది కార్మికులు ఉన్నారని, అందులో కేవలం 225 మంది మాత్రమే స్థానికులు ఉన్నారని అన్నారు.అదేవిధంగా మణుగూరు ఓసి టు విపిఆర్ ప్రైవేట్ కంపెనీలో 431 మంది కార్మికుల పనిచేస్తున్నారని, అందులో కేవలం 180 మంది మాత్రమే స్థానికులు ఉపాధి పొందుతున్నారన్నారు. స్థానిక ప్రజలు సింగరేణి వల్ల ఎన్నో ఇబ్బందులు పడుతున్నప్పటికి, సంస్థ అభివృద్ధి కోసం ఎన్నో సంవత్సరాలుగా సహకారాలు అందిస్తున్నారని, అయినప్పటికీ స్థానిక సింగరేణి అధికారులు పినపాక నియోజకవర్గం లోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో నిర్లక్ష్యం చూపుతున్నారని తెలిపారు. ఇంత జరుగుతున్న స్థానిక రాజకీయ నాయకులు అధికార పార్టీ కానీ ప్రతిపక్ష నాయకులు కానీ ఏనాడు నిరుద్యోగుల సమస్య మీద పట్టించుకోలేదని, వారికి స్థానిక నిరుద్యోగుల పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. పేరుకే సింగరేణి యూనియన్లు ఉన్నాయని, ఏ ఒక్క యూనియన్ నాయకులు కూడా స్థానికుల తరఫున పోరాటం చేసేందుకు సుముఖత చూపెట్టకపోవడం సిగ్గుచేటు అన్నారు. స్థానికులకు కాకుండా స్థానికేతరులకు ఉపాధి కల్పించడం ద్వారా ఎందరో నిరుద్యోగులు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని, కాబట్టి సింగరేణి అధికారులు తక్షణమే నిరుద్యోగ సమస్యలను అర్థం చేసుకొని యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలని కర్నె రవి సింగరేణి జిఎంను కోరారు. ఈ కార్యక్రమంలో మణుగూరు అడ్వకేట్ నాగార్జున రెడ్డి పాల్గొన్నారు.



# విధుల నిర్వహణలో పటిష్టంగా పని చేయండి

- అలవాటుగా నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ తప్పదు
- గంజాయి నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలి
- విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్, యాంటీ నార్కోటిక్ కమిటీలు ఏర్పాటు.
- సూర్యాపేట జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే

**సూర్యాపేట, విశాలభారతి:** విధుల నిర్వహణలో పటిష్టంగా సిబ్బంది పని చేయాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు.గురువారం జిల్లా పోలీసు కార్యాలయం నందు జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు ఎస్పి నాగేశ్వరరావు గారితో కలిసి డీఎస్పీ లు, సీఐ లు, ఎస్ఐ లతో కేసుల నమోదు, దర్యాప్తు పై సమీక్షా సమావేశం నిర్వహించారు, పోలీసు అధికారులు, సిబ్బంది విదుల నిర్వహణ, కేసుల నమోదులో లోపాలు లేకుండా పటిష్టంగా ప్రణాళిక ప్రకారం పని చేయాలని దిశానిర్దేశం చేసినారు. జిల్లాలో నమోదౌవుతున్న కేసుల యొక్క తీరుతెన్నులు, కేసుల స్థితిగతులు, పెండింగ్ కేసుల దస్త్రాలు, కేసుల ఆన్లైన్ నమోదు, పోలీసు పని విభాగాల నిర్వహణ, ఎన్ఫోర్స్మెంట్ ను పరిశీలించారు. పెండింగ్ లో ఉన్న ప్రతి కేసు రికార్డు ను పరిశీలన చేసి త్వరిత గతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేరాల నివారణ, కేసుల దర్యాప్తులో లో కొత్త పద్ధతులు, అధునాతన సాంకేతికత అందుబాటులో ఉన్నాయి. వనరులను సద్వినియోగం చేసుకుని నాణ్యమైన దర్యాప్తు చేయాలని అన్నారు.గంజాయి నిర్మూలనలో భాగంగా విద్యాసంస్థలు ల్లో, కమ్యూనిటీ ఏరియాల్లో యాంటీ నార్కోటిక్ కమిటీలు ఏర్పాటు చేయాలి దీనికి సంభందించి విద్యాసంస్థలకు సమాచారం ఇవ్వాలి, ఎక్కువగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి, ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలలో గంజాయి నిర్మూలన అంశంపై ఫ్లెక్సీలు పెట్టించాలి అని తెలిపినారు. జిల్లాలో గంజాయి లేకుండా గంజాయి రహిత జిల్లాగా చేయడానికి ఎక్కువగా ఫోకస్ చేయాలి, క్షేత్ర స్థాయిలో నిఘా ఉంచాలి, సమాచారం ఇచ్చే వనరులను బలోపేతం చేసుకోవాలి అని తెలిపినారు. గంజాయి, నార్కోటిక్ పదార్థాల నివారణకు జిల్లా నార్కోటిక్ పదార్థాల నిరోధక కమిటీ తో సమన్వయంతో పని చేయాలని సూచించారు. గతంలో గంజాయి సరఫరా చేసిన వారిపై, గంజాయి వినియోగించిన వారిపై నిరంతర నిఘా ఉంచి కౌన్సిలింగ్ ఇవ్వాలని తెలిపినారు. అక్రమ రవాణా, అక్రమ కార్యకలాపాలు జరగకుండా చూడాలి అన్నారు. గంజాయి నిర్ములనలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని, గంజాయి రవాణా, సరఫరా, వినియోగం పై పోలీసు, డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు. జిల్లాలో ఉన్న పాత నేరస్తులు, అక్రమవ్యాపారులు, అలవాటుగా నేరాలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ గారు ఆదేశాలు జారిచేశారు. పోలీసు ఫంక్షన్ వర్టికల్ పని విభాగాలను సమర్ధవంతంగా నిర్వహించాలి అన్నారు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పి నాగేశ్వరరావు, సబ్ డివిజన్ డీ ఎస్పీలు నాగభూషణం, ప్రకాష్, డిసి ఆర్ బీ డిఎస్పీ రవి, సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రాజేష్, మహేష్ సిబ్బంది ఉన్నారు.



## ఐలు 14వ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

**రామన్నపేట, విశాలభారతి:** డిసెంబర్ 28 నుంచి 30 వరకు కోల్కత్తా నగరంలో జరిగే ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఐలు 14వ మహాసభల పోస్టర్ను రామన్నపేటలో సీనియర్ న్యాయవాది యాపాల కృష్ణారెడ్డి బార్ ప్రెసిడెంట్ శోభన్ బాబు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ లాయర్ల సంక్షేమం కోసం ఐదు పాటు పడుతుందని మహాసభలు జయప్రదం కావాలని వారు అన్నారు రాబోయే కాలంలో మరిన్ని న్యాయవాదుల సంక్షేమ కోసము పోరాటాలు నిర్వహించాలని వారు అన్నారు. ఐలు జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులపై రోజురోజుకు దాడులు పెరుగుతున్నాయని న్యాయవాదుల ఆత్మ రక్షణ కోసం రక్షణ చట్టాన్ని దేశవ్యాప్తంగా ఏర్పాటు చేయాలని రాబోయే కాలంలో మరిన్ని పోరాటాలు నిర్వహించేందుకు హాలిడే మహాసభల్లో భవిష్యత్ కర్తవ్యాల్ని ఎంచుకొని పోరాట న్యాయవాదుల కోసం ఏ విధమైనటువంటి పోరాటాలు నిర్వహించాలని భవిష్యత్ కర్తవ్యం నిర్దేశిస్తుందని ఈ మహాసభలకు అందరూ జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు జినుకల ప్రభాకర్ ఉయ్యాల హనుమంతు, రామదాసు, ఎండి మజీద్ ,బార్ కార్యదర్శి నకరికంటి మొగులయ్య, ఉపాధ్యక్షుడు శ్రీశైలం, దినేష్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.



## పేదింటి ఆడబిడ్డ పెళ్లికి చేయూత

**షాద్ నగర్,విశాలభారతి:** కేశంపేట మండలం తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన కటికె కృష్ణయ్య కూతురు శ్రీలత వివాహము ఈ నెల 22శుక్రవారం నిశ్చయమైనది.కృష్ణయ్యది నిరుపేద కుటుంబం కావడంతో అమ్మాయి పెళ్ళికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బీస కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు 50kg ల బియ్యం, 8,016 రూపాయలు గురువారం సాయంగా అందించి వివాహంకు చేయూత అందించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోగుల భీమయ్య,లాలమెని చంద్రయ్య,గుత్తి శేఖర్,గుత్తి చంద్రయ్య,పోగులనర్సింలు,కందెన శివయ్య,భీంరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,రాంరెడ్డి, నారంజి,నిరంజన్, పాండు, కందెన కృష్ణ,కుమ్మరి శ్రీను,చెన్నయ్య, బత్తుల రాజు, యాదయ్య,చందు తదితరులు పాల్గొన్నారు.




## సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ దొడ్ల

**కూకట్ పల్లి,విశాలభారతి:** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని శంశిగుడా ఆదర్శ నగర్ లో గల గ్లోరియస్ ప్రార్థన మందిరం వారు నిర్వహించిన సెమి క్రిస్మస్ వేడుకల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై కేక్ కట్ చేసి, ఏసుక్రీస్తు గొప్పతనం గురించి ప్రసంగించి, అందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో భాగంగా పాస్టర్లకు మరియు చర్చ్ సభ్యులకు అందించిన నూతన వస్త్రాలను కార్పొరేటర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ పి.ఇస్రాయిల్, ఎమ్. రాజు, ఎమ్.ఎమ్. సురేష్ కుమార్, ఎమ్. సత్యరాజు, ఎమ్ శ్యామ్ జాషువా, సి.ఎచ్ ఫిలిప్, నాగభూషణం, ఎమ్. దేవదాస్, యు .ముకేశ్, జి.సుమన్, సుశీల్ పాల్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మరియు చర్చ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని శేరిలింగంపల్లి జంటసర్కిళ్ళ పరిధిలోని 30 కాలనీలలో ముత్యాల ముగ్గుల పోటీలను ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కొమిరిశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ప్రతి కాలనీకి ప్రథమ,ద్వితీయ,తృతీయ 5 కన్సొలేషన్ ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నామని కొమిరిశెట్టి ఫౌండేషన్ చైర్మన్ కొమిరిశెట్టి సాయిబాబా, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ అన్నారు.కొండాపూర్ డివిజన్ పరిధిలో గల 8వ పోలీస్ బెటాలియన్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు..ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 8వ బెటాలియన్ రిజర్వ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.శ్రీనివాస్ విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ మేరకు సాయిబాబా రామస్వామి యాదవులు మాట్లాడుతూ ఆరోగ్యాన్ని, పారిశుధ్యాన్ని, విజ్ఞానాన్ని మేళవించే సనాతన సాంప్రదాయమే ఇంటి ముందు ముగ్గులు వేయడమన్నారు.ఈ ముగ్గులు ప్రతిరోజు ఇంటి పరిసరాలను పరిశుభ్ర పరిచి, గోమయంతో కళ్ళాపి చల్లి, బియ్యపు పిండితో రకరకాల రంగవల్లులను కళాత్మకంగా మహిళలు తీర్చిదిద్దుతారన్నారు. ముఖ్యంగా ధనుర్మాసంలో ఈ బియ్యపు పిండి తినేందుకు చీమలుచేరి క్రిమి కీటకాలను లోపలికి రాకుండా కాపాడతాయని,అలాగే గోమయం వాసన వలన కూడా విషపూరితమైన కీటకాలు ఇంటి పరిసరాలలోకి రావని, దీంతో పరిసరాలు పరిశు



భ్రంగా ఉండటమే కాకుండా మనిషి ఆరోగ్యంగా ఉండేందుకు సహాయపడుతుందన్నారు. అలాగే ఇంటి ముందు ముగ్గులు చూడటానికి అందంగా కన్పిస్తాయన్నారు. ఈ ముగ్గులు వేసే ప్రక్రియలో మహిళలకు జరిగే వ్యాయామం వలన అనేక గర్భకోశ వ్యాధులు రాకుండా ఉండేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వైద్య నివేదికలు తెలుపుతున్నాయన్నారు. పట్టణీకరణ నేపథ్యంలో అపార్ట్ మెంట్ కల్చర్ బాగా పెరిగిన తరువాత మన ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలు కనుమరుగవుతున్న ప్రస్తుత తరుణంలో మన సంస్కృతి సంప్రదాయాలను భవిష్యత్తు తరానికి అందించడానికి మరియు మహిళలలో ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి ఈ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా తాటిచర్ల వరలక్ష్మి వ్యవహరించారు.కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వాణి సాంబశివరావు మరియు కార్యక్రమ ఆర్గనైజర్ తన్వీర్ బేగం పాల్గొన్నారు. ఈ పోటీలలో వంద మందికి పైగా మహిళలు పాల్గొన్నారు.

## ప్రభుత్వం మారిన
# మార్కెట్ పై ప్రభావం లేదు?మార్పు రాదా?

**ఏదేచ్చగా మారుతున్న యార్డు యాజమాన్యము పేర్లు?**

**విశాలభారతి,సికింద్రాబాద్ కంటోన్మెంట్:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ ఆసియా లోనే అతిపెద్ద యార్డుగా గుర్తింపు పొందింది.దేశంలో ఉన్న 17 రాష్ట్రాల నుంచి వివిధ రకాలైన కూరగాయలను దిగుమతి చేసుకునే బోయినపల్లి మార్కెట్, సగటున ఒక రోజుకి 25 వేల క్వింటల కూరగాయలు తరలి రావడం ఇది మామూలు విషయం కాదని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేశారు అలాగే వచ్చిన కూరగాయలు నిలువ ఉండకుండా, ఎప్పటికప్పుడు క్రయ విక్రయాలు జరగడం గమనహర్హం. 2021 డిసెంబర్ 20న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముండా మార్కెట్ ని దృష్టిలో పెట్టుకొని, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్,గాంధీ హాస్పిటల్ పరిసర ప్రాంతాలు ట్రాఫిక్ అష్టదిగ్బంధానికి కారణమవుతున్న ముండా మార్కెట్ ని తరలించాలన్న ఆలోచనతో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం కమిషన్ ఏజెంట్లని తిరుమలగిరి మండలం లో ఉన్న సర్వేనెంబర్ 83పీ (పార్ట్) 23 ఎకరాల ప్రభుత్వ భూమిలో బోయిన్పల్లి మార్కెట్ గా నామకరణం చేస్తూ 175 మంది కమీషన్ ఏజెంట్లకు లైసెన్సులు జారీ చేసిన ప్రభుత్వం, వ్యవసాయ చట్ట ప్రకారం 1966 నియమ నిబంధనలకు లోబడి మార్కెట్ యార్డులో కమిషన్ ఏజెంట్లు వ్యాపార లావాదేవులు నిర్వహించాలని, అదే కాకుండా కేటాయించిన షాపులని ఇతరులకు విక్రయించరాదని ప్రత్యేకంగా లైసెన్స్ పత్రంలోనే పొందుపరచడం గమనహర్హం. బోయిన్పల్లి లో 20 ఏళ్ల క్రితం ఏర్పడిన ఈ మార్కెట్ అధికారుల కళ్ళుగప్పి నూటికి 70 శాతం దుకాణాల క్రయ విక్రయాలు జరగడం విజిలెన్స్ అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా మిగిలిందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడ్డారు.అలాగే గతంలో మార్కెట్ యార్డ్ లో దుకాణం నెంబర్ బీ49 భరత్ వెజిటేబుల్స్ ప్రొపరేటర్ శ్రీశైలం ఓ అస్మద్దియునికి దుకాణం కిరాయి కి ఇవ్వడం to దేశ రాజధాని హస్తినా నుంచి ఆలుగడ్డ రైతు జితేందర్ సింగ్ నుంచి లక్షల్లో ఆలుగడ్డ దిగుమతి చేసుకొని రైతుకు కుచ్చుటోపీ అడ్రస్(ఐపీ) లేకుండా జమాయం కావడం తో లైసెన్స్ కలిగి ఉన్న




శ్రీశైలంకి మేడ్చల్ జిల్లా కలెక్టర్ నుంచి నోటీసులు మార్కెట్ సెక్రటరీకి జారీ చేశారు. అలాగే సంబంధిత తిరుమలగిరి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు కావడంతో ఆగమేఘాల మీద ఉరుగుల పరుగులతో, మార్కెట్ యార్డ్ కి చేరుకొని నోటీసును అందుకున్న శ్రీశైలం షాక్ తో షేక్ అయి, ఎక్కడ లైసెన్స్ రద్దవుతుందన్న భయంతో అప్పులు చేసి హస్తి నాకు చెందిన రైతు జితేందర్ సింగ్ కు కిరాయి దారు ఎగ్గొట్టిన డబ్బు మొత్తం చెల్లించాడు. మరోసారి షాప్ నాదే అంటూ లక్ష్మణ్ యాదవ్ ఢిల్లీలో నలుగురు రైతులను మోసం చేసిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అదేగాక గత నాలుగు రోజుల క్రితం తిరుమలగిరి పోలీస్ స్టేషన్లో లక్ష్మణ్ యాదవ్ సీ2 దుకాణం నాదే అంటూ, 2లక్ష 70వేల రూపాయల విలువగల ఆలుగడ్డ, క్యారెట్ దిగుమతి చేసుకొని రైతుకు ఎగనామం పెట్టినట్లు తిరుమలగిరి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది.

**బోయిన్పల్లి మార్కెట్లో సీ2 సేట్ ఎవరు?**

మార్కెట్ శాఖ జారీ చేసిన లైసెన్స్ ప్రకారం, లైసెన్స్ యజమాని పేరు ట్రేడర్ వివరాలు దుకాణంపై పొందుపరచాలి, కానీ 1966 వ్యవసాయ చట్టాన్ని తుంగలో తొక్కి క్రయవిక్రయాలు సాఫీగా నిర్వహిస్తూ.. షాప్ లైసెన్స్ నాదే అంటూ ఒకరు ఢిల్లీలో నాటకానికి తెరలేపితే, మరొకరు అసలైన లైసెన్స్ హోల్డర్ పేరు సమాధి చేసి వారి పేర్లు రాసుకోవడం,యాడ్ అధికారులు తమకేం పట్టనట్లు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం శోచనీయం.




**అసలు ఈ అంజి ఎవరు?**

మార్కెట్ శాఖ జారీ చేసిన సీ2 లైసెన్స్ యజమాని విక్రయించడంతో కొనుగోలు చేసిన అంజి తెరమీదకి రావడం, అలాగే తాను కొనుగోలు చేసిన షాపును కిరాయికి ఇచ్చి, మరో షాపు వద్ద ఆయన వ్యాపార లావాదేవీలు నిర్వహించడం, సూపర్వైజర్లు అధికారులకు కానరావట్లేదా? సీ2 పేరు మీద రైతులను మోసం చేసిన లక్ష్మణ్ యాదవ్, ప్రస్తుతం కొనుగోలు చేసిన, వ్యవసాయ శాఖ జారీ చేసిన లైసెన్స్ షాపు యజమాని పైన ఈ ముగ్గురిలో ఎవరి పైన చర్యలు తీసుకుంటారు అధికారులు, త్వరలోనే తేలనుంది? అసలైన యజమాని ఎవరో బయటపడేందుకు అధికారులకు దొరికిన సదావకాశం. ఇదే మంచి సమయం? అదేగాక లైసెన్స్ ద్వారా కేటాయించిన దుకాణాల్లో రైతు పంపిన సరుకు నిల్వ చేయాల్సిన చోట, ఆడంబరాలకు పోతూ విశాలమైన గదులు నిర్మించుకుంటూ, సరుకు పెట్టుకోవడానికి చోటు మార్పులు చేర్పులు చేస్తున్నారు. వచ్చిన సరుకును అంగట్లో(రోడ్డు) పెడుతూ గొడుగు నీడలో రోడ్డుపై సరుకులు పెట్టి విక్రయించడం పరోక్షంగా ట్రాఫిక్ అంతరాయానికి కారణమవుతున్నారు. మార్కెట్ అధికారులు పలుమార్లు హెచ్చరించిన పెడచెవిన పెడుతూ, ఖరీదుదారులకు కృత్రిమంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

**మార్కెట్ శాఖలో నిద్రలేస్తున్న విజిలెన్స్ అధికారులు?**

వ్యవసాయ శాఖ ప్రధాన కార్యాలయం నుంచి గతంలో రాష్ట్రంలో ఉన్న 193 మార్కెట్ యార్డులల్లో ఎవరి పేరు పైన లైసెన్సులు జారీ చేశారు, వాటి వివరాలు వీలైనంత త్వరగా మార్కెట్ సెక్రటరీలు అందజేయాలని ఆదేశాలు జారీ అయినట్లు విశ్వసనీయ సమాచారం. ఒకవేళ అదే నిజమవుతే 193 మార్కెట్ యాదర్డ్ లో ఒకటి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో నూటికి 70 శాతం లైసెన్సు కొనుగోలు చేసుకున్న వారే వ్యాపారం చేస్తున్నట్లు నిజ నిజాలు వెలుగులోకి వస్తే వారి లైసెన్సులు రద్దు అయ్యే అవకాశం ఉంది? మార్కెట్లో లైసెన్సుల విక్రయాలే కాకుండా, లైసెన్స్ దారులమంటూ రైతులను నిలువెళ్ల ముంచుతున్న కేటుగాళ్లకు చెక్కు పెట్టాల్సిన సమయం ఆసన్నమైందంటూ పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

**ఏఎంసీ మార్కెట్ ఛైర్ పర్సన్ వివరణ**

మార్కెట్లో జరుగుతున్న అవినీతి బాగోతాలు గతంలో చోటు చేసుకున్నాయి. బోయిన్పల్లి మార్కెట్ చైర్ పర్సన్ గా రాగిరి హారిక బాధ్యతలు చేపట్టిన నుంచి ప్రక్షాళన చేస్తూ, సమస్యలకు పరిష్కారం చేస్తున్నారు. లైసెన్స్ అవకతవకలపై ప్రశ్న న్యూస్ వివరణ కోరగా కమిటీ దృష్టికి ఏమీ రాలేదని, ఒకవేళ లైసెన్స్ లో అవకతవకలు చోటు చేసుకుంటే తక్షణమే సెక్రటరీ సహాయ సహకారంతో ఉన్నతాధికారులకు లేఖలు రాస్తామని చైర్ పర్సన్ రాగిరి హారిక వెల్లడించారు.



## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

**తుంగతుర్తి, విశాలభారతి:** ప్రపంచంలోని అన్ని దేశాలు జరుపుకునే ఏకైక పండుగ క్రిస్మస్, ప్రేమ దయా కరుణ జాలి క్రీస్తు సందేశం అని, క్రీస్తు చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరు అనుసరించాలని మండల కేంద్రంలోని మేరీమదర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రిన్సిపాల్ మేరీ విజ్జి అన్నారు. గురువారం పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించి మాట్లాడారు.క్రీస్తు జన్మదినం అందరికీ పవిత్రమని,యేసు లోకాన్ని ఉద్ధరించడానికి అవతరించాడని,ప్రభువైన యేసు మానవాళికి ఆదర్శనీయుడని అన్నారు. అందరూ క్షమాగుణం ,సేవా భావం, మానవత్వం కలిగి ఉండాలన్నారు. క్రీస్తు దీవెనలతో అందరూ సుఖ సంతోషాలతో,ఆయురారోగ్యాలతో జీవించాలని,కుల మతాలకు అతీతంగా మెలగాలని అన్నారు.ఏసుక్రీస్తు బోధనలు అనునిత్యం అనుసరించదగిన మార్గదర్శకాలని అన్నారు.ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకర్షించాయి.ఈ కార్యక్రమంలో మేనేజర్ అలేసియా, వైస్ ప్రిన్సిపాల్ మేరీ రిన్సీ, ఫాదర్ జయంత్, పాస్టర్ యాకూబ్, సిస్టర్ హెలెన్, సిస్టర్ జ్యోతి, సిస్టర్ మరియ,స్టాఫ్ సెక్రటరీ అనిత, వైస్ సెక్రటరీ అశోక్ ఉపాధ్యాయ బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ఎలక్ట్రికల్ సమస్యలను పరిష్కరిస్తా

**శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్**

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి సంక్షేమం కోసం కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని నల్లగండ్ల సెక్షన్ ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ అధికారులతో గురువారం నిర్వహించిన రివ్యూ మీటింగ్ లోకార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పాల్గొన్నారు.ఈ మేరకు బస్తీలలో పలు చోట్ల నూతనంగా వేసిన సీసీ రోడ్లలో ఎలక్ట్రికల్ పోల్స్ ఇబ్బందికరంగా మారాయని వెంటనే తొలగించాలని కార్పొరేటర్ ఎలక్ట్రికల్ డీఈ, ఏఈ లకు కోరారు.గోపి నగర్, నెహ్రూనగర్, ఆదర్శ నగర్, ప్రశాంతి నగర్, బాపు నగర్ తదితర కాలనీలలో, బస్తిల్లో శిథిలావస్థకు చేరుకున్న కరెంటు పోల్స్ ను తొలగించి వాటి స్థానంలో నూతన కరెంట్ పోల్స్ ను ఏర్పాటు చేయాలని, కొన్ని చోట్ల ప్రమాదకరంగా ఇంటిపై నుండి వెళ్లిన విద్యుత్ వైర్లను తొలగించి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని, ప్రమాదకరంగా రోడ్డు పై ఉన్న ట్రాన్స్ఫార్మర్లను తీసి కొత్తవి ఏర్పాటు



చేయాలని నాగేందర్ యాదవ్ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ డీఈ గోపాల్ కృష్ణ, ఏడీ రాంబాబు, ఏఈ వెంకట నారాయణ రెడ్డి, సబ్ ఇంజనీర్ కిషోర్, లైన్ ఇన్స్పెక్టర్ వెంకట్ రెడ్డి, డివిజన్ గౌరవ అధ్యక్షులు వీరేశం గౌడ్, మాజీ కౌన్సిలర్ సోమదాస్, కొండల్ రెడ్డి, వార్డ్ మెంబర్ పర్వీన్ బేగం, గోపినగర్ బస్తీ ప్రెసిడెంట్ గోపాల్ యాదవ్, ఆదర్శ నగర్ కాలనీ ప్రెసిడెంట్ మల్లారెడ్డి, లక్ష్మి నాయుడు, దాసోజు శ్రీనివాస్, నెహ్రు నగర్ బస్తీ ప్రెసిడెంట్ గఫర్, సత్యనారాయణ, పిల్లి యాదగిరి, అశోక్, కొయ్యాడ లక్ష్మణ్ యాదవ్, సుభాష్ రాథోడ్, ప్రభాకర్, మూర్తి, సురేష్, తదితరులు పాల్గొన్నారు



## ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి

**ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన కార్పొరేటర్ సబిహా గౌసుద్దీన్.**

**కూకట్ పల్లి,విశాలభారతి:** కూకట్ పల్లి నియోజకవర్గం అల్లపూర్ డివిజన్ పరిధిలోని పర్వత్ నగర్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం కార్పొరేటర్ సబిహా గౌసుద్దీన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలోని పలు సమస్యలపై డ్యూటీ డాక్టర్ విజయచంద్ర మరియు సిబ్బందిని సమస్యలు అడిగి తెలుసుకోవడంతో స్టాఫ్ నర్స్ లను పెంచాలని, హాస్పిటల్ లో ప్లంబింగ్ వర్క్, వార్డు రూములలో విద్యుత్ దీపాలు పలు సమస్యలున్నాయని ఎమ్మెల్యే మాధవరం కృష్ణ రావు దృష్టికి తీసుకెళ్లి సమస్యలకు సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన చికిత్స అందించాలని, ఎటువంటి సమస్యలు ఉన్న మా దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు, ఆశ వర్కర్లు, డివిజన్ కోఆర్డినేటర్ వీరారెడ్డి, జాహిద్ షరీఫ్ బాబా, టిఆర్ఎస్ రాజు, శ్రీనివాస్ యాదవ్, గంగపుత్ర శంకర్, రాము యాదవ్, కళ్యాణ్ నాయక్, వెంకటమ్మ, రేవతి, సన్న రాజుల లక్ష్మి, చిట్టెమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## పశు సంచార వాహనాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- స్టేట్ ప్రోగ్రాం అధికారి భగీష్ మిశ్రా
- 1962 పశు సంచార వాహనం ఆకస్మిక తనిఖీ

**కల్వకుర్తి,విశాలభారతి:** పశు సంచార వాహనాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని 1962 స్టేట్ ప్రోగ్రాం అధికారి భగీష్ మిశ్రా అన్నారు. గురువారం కల్వకుర్తి పట్టణంలోని ఎంపీడీవో ఆవరణలో పశు సంచార వాహనాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవలసిన సలహాలు సూచనలు చేశారు ఉన్న మెడిసిన్ వ్యాలిడిటీని చెక్ చేశారు రైతు ఫోను చేసిన వెంటనే సకాలంలో చేరుకొని పశువులకు వైద్యం అందించాలని అందించి పశువులని రోగాల బారి నుండి కాపాడాలని ఆయన తెలిపారు అంబులెన్స్ లో ఉన్న




సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందించారు. వారి వెంట ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ మహబూబ్ మియా, నాగర్ కర్నూల్ జిల్లా ఎమర్జెన్సీ మెడికల్ ఎగ్జిక్యూటివ్ పెండ్యాల శ్రీకాంత్, డాక్టర్ విలేక, పారబిట్ తేజశ్రీ, కెప్టెన్ విక్రమ్, హెల్పర్ ఆదర్శ్, ఉన్నారు.

## హైదరాబాద్లో కరోనా హడల్

**రోజు రోజుకు పెరుగుతున్న కేసులు**

విశాల భారతి, స్టేట్ బ్యూరో:

రెండేళ్లకు ముందు ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కరోనా మహమ్మరి ఇప్పుడు కొత్త వేరియంట్ లతో భయపెడుతుంది. పలు రకాల వేరియంట్లతో తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. మొదటగా కేరళలో మొదలైన కొత్త వేరియంట్ జేఎన్ 1.. ఇప్పుడు అన్ని రాష్ట్రాలకు వ్యాపిస్తుంది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అలర్ట్ అయ్యాయి. తప్పనిసరిగా కొవిడ్ ఆంక్షలు పాటించాలని ప్రభుత్వాలు పేర్కొంటున్నాయి. కొత్త వేరియంట్ పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నాయి. ఇదిలా ఉంటే.. తెలంగాణలోనూ కరోనా కొత్త వేరియంట్ కేసులు నమోదవుతున్నాయి. తాజాగా మరో రెండు కేసులు బయటపడ్డాయి. నిన్న (బుధవారం) హైదరాబాద్ లో 6 కేసులు నమోదు




కాగా.. ఈ రోజు మరో రెండు కేసులు నమోదయ్యాయి. సాయంత్రం వరకు కరోనా హెల్త్ బులెటిన్ విడుదల కానుంది. అందులో రాష్ట్ర వ్యాప్తంగా ఇంకెన్ని కేసులు నమోదయ్యాయో తెలుస్తుంది. కాగా.. తాజాగా నమోదైన కొవిడ్ కేసులు ఫీవర్ హాస్పిటల్ లో నమోదైనవిగా గుర్తించారు వైద్యాధికారులు. నాలుగు శాంపుల్స్ టెస్ట్ కి పంపితే.. రెండు పాజిటివ్ గా వచ్చినట్లు తెలిపారు. జీనోమ్ సీక్వెన్స్ కోసం శాంపుల్స్ ను పుణెకు పంపారు.



# 'నా సామిరంగ' భారీ సెట్‌లో టైటిల్ సాంగ్ షూటింగ్

కింగ్ నాగార్జున అక్కినేని మాస్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'నా సామిరంగ' షూటింగ్ చివరి దశలో ఉంది. ఈ చిత్రానికి విజయ్ బిన్ని దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం స్టూడియోలో వేసిన భారీ సెట్‌లో నా సామిరంగ టైటిల్ సాంగ్‌ని చిత్రీకరిస్తున్నారు. ఆస్కార్ అవార్డ్ విజేతలు - ఎంఎం కీరవాణి ఫుట్ ట్యాపింగ్ ట్యూన్ కంపోజ్ చేయగా చంద్రబోస్ లిరిక్స్ అందిస్తున్నారు. ఈ మాస్ నంబర్‌లో నాగార్జునతో పాటు అల్లరి నరేష్, రాజ్ తరుణ్ కూడా అలరించనున్నారు. సినిమాకే పెద్ద ఆకర్షణగా నిలవనున్న ఈ పాట చిత్రీకరణలో 300 మంది డ్యాన్సర్లు పాల్గొంటున్నారు. దినేష్ మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. టీజర్‌లో నాగార్జునతో అల్లరి నరేష్, రాజ్ తరుణ్ స్క్రీన్ షేర్ చేసుకోవడం అభిమానులకు ఆనందాన్ని కలిగించింది. టీజర్ కి అద్భుతమైన స్పందన వచ్చింది. ముగ్గురిపై పాట థియేటర్స్ లో అదిరిపోయేలా వుంటుంది. నాగార్జున, ఎంఎం కీరవాణి, చంద్రబోస్‌ల బ్లాక్‌బస్టర్ కాంబినేషన్‌లో మ్యూజిక్ ఆల్బమ్ అన్ని మ్యూజిక్ చార్ట్‌లలో టాప్ లో వుంది.



# రెగ్యులర్ షూటింగ్‌లో తండేల్

యువ సామ్రాట్ నాగ చైతన్య, సక్సెస్ ఫుల్ దర్శకుడు చందూ మొండేటి, ప్రముఖ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మిస్తున్న హై బడ్జెట్ చిత్రం 'తండేల్' కొద్ది రోజుల క్రితం గ్రాండ్ గా లాంచ్ అయింది. ఈరోజు ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఉడిపిలో ప్రారంభమైంది. యాక్టర్స్ అందరూ పాల్గొంటున్న ఈ కీలక షెడ్యూల్ లో చిత్ర యూనిట్ టాకీ, యాక్షన్ పార్ట్‌ను చిత్రీకరిస్తుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ కర్ణాటకలోని మల్పే పోర్ట్ (ఉడిపి)లో జరుగుతోంది. నాగ చైతన్యతో పాటు ఫైటర్స్ పై యాక్షన్ సీక్వెన్స్ తీస్తున్నారు. నాగ చైతన్య ఈ చిత్రంలో మత్స్యకారునిగా నటించడానికి బీస్ట్ మోడ్ లోకి మారారు. కండలు తిరిగిన దేహం కోసం గత కొన్ని నెలలుగా చాలా హార్ట్ వర్క్ చేశారు. పొడవాటి జుట్టు, గడ్డంతో రగ్గడ్ లుక్ లో కనిపిస్తారు. యదార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో నాగ చైతన్య సరసన సాయి పల్లవి హీరోయిన్‌గా నటిస్తోంది. 'తండేల్' పూర్తిగా భిన్నమైన నేపథ్యంలో సాగే ప్రేమకథ. అత్యున్నత సాంకేతిక నిపుణులను ఈ చిత్రానికి పని చేస్తున్నారు. కథలో సంగీతానికి మంచి స్కోప్ ఉన్నందున, జాతీయ అవార్డ్ విన్నింగ్ కంపోజర్ రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ తన సౌండ్‌ట్రాక్‌లు, బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తో ప్రేమకథను అందంగా తీర్చిదిద్దుతున్నారు.

# స్టార్ హీరో నటవారసురాలు

బాలీవుడ్ లో వరుసగా నటవారసులు తెరకు పరిచయం అవుతున్నారు. ఇటీవలే ది ఆర్చీస్ సిరీస్ తో కింగ్ ఖాన్ షారూఖ్ నటవారసురాలు సుహానా ఖాన్, అమితాబ్ బచ్చన్ మనవడు అగస్త్య నందా వెండితెరకు పరిచయం అయ్యారు. ఇంతలోనే ఇప్పుడు అజయ్ దేవగన్- కాజోల్ దంపతుల నటవారసురాలు నైసా దేవగన్ బాలీవుడ్ ఆరంగేట్రం గురించి హిందీ మీడియాలో ఆసక్తికర చర్చ సాగుతోంది. సెలబ్రిటీ పార్టీల్లో నిరంతర చర్చల్లో నిలుస్తున్న నైసా బరిలోకి వచ్చేస్తోందని యూత్ లోను ముచ్చట సాగుతోంది. Also Read - కావ్య థాపర్ సొగసు చూడతరమా? కానీ ఇప్పుడు వారి ఊహకు భిన్నమైన సమాధానం దేవగన్ నుంచి వచ్చింది. కరణ్ చాట్ షో `కాఫీ విత్ కరణ్ 8` తాజా ఎపిసోడ్‌లో చిరకాల స్నేహితులు అజయ్ దేవగన్ -రోహిత్ శెట్టి ప్రత్యక్షమయ్యారు. అజయ్, రోహిత్‌లు దాదాపు 33 ఏళ్లుగా స్నేహితులు. ఇప్పుడు వారు తమ పిల్లలు తమ బాలీవుడ్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడం గురించి మాట్లాడారు. అయితే నైసా ఆరంగేట్రం గురించి దేవగన్ షాకిచ్చే విషయం చెప్పారు. తన కూతురు నైసాకు ఇప్పట్లో సినిమా రంగంలోకి వచ్చే ఆలోచన లేదని అజయ్ దేవగన్ అన్నారు. ``ప్రస్తుతం ఆమె నట ప్రపంచంలోకి రావాలని కోరుకోవడం లేదు. ఆమె అలా ఉండాలని నేను అనుకోను.. కానీ రేపు ఏదైనా మారితే చూద్దాం`` అని అజయ్ దేవగన్ అన్నారు. ప్రస్తుతం సున్నా శాతం అవకాశం మాత్రమే ఉంది అని దేవగన్ చెప్పాడు.



# 29న వరల్డ్ వైడ్‌గా 'డెవిల్'



తనదైన ఇమేజ్ సంపాదించుకున్న కథానాయకుడు నందమూరి కళ్యాణ్ రామ్ లేటెస్ట్ మూవీ 'డెవిల్'. ది బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్ ట్యాగ్ లైన్. సంయుక్తా మీనన్, మాళవికా నాయర్ హీరోయిన్స్. అభిషేక్ పిక్చర్స్ బ్యానర్‌పై అభిషేక్ నామా దర్శక నిర్మాతగా ఈ సినిమాను రూపొందించారు. డిసెంబర్ 29న ప్రపంచ వ్యాప్తంగా సినిమా భారీ ఎత్తున విడుదలవుతుంది. రీసెంట్‌గా విడులదైన డెవిల్ మూవీ ట్రైలర్‌కు ఎక్స్‌ట్రార్డినరీ రెస్పాన్స్ వచ్చింది. పీరియాడిక్ జోనర్‌లో రిలీజ్ అవుతున్న ఈ చిత్రం ఆడియెన్స్‌కి ఓ సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్ ఇస్తుంది. లేటెస్ట్‌గా ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని యు/ఎ సర్టిఫికేట్‌ను పొందింది. 2 గంటల 26 నిమిషాలుగా రన్ టైమ్‌ను ఫిక్స్ చేశారు. డెవిల్ సినిమాపై పాజిటివ్ టాక్ రావటంతో అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కళ్యాణ్ రామ్ స్టైలిష్ యాక్షన్ సీక్వెన్స్ ప్రేక్షకులను మెప్పించనున్నాయి. దీంతో పాటు డ్రామా, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఆడియెన్స్‌ని అలరించనున్నాయి.


# వై.ఎస్.జగన్ బర్త్ డే స్పెషల్ 'యాత్ర 2' పోస్టర్

మహి వి రాఘవ్ దర్శకత్వంలో త్రీ ఆటమ్ లీవ్స్, వీ సెల్యూలాయిడ్, శివ మేక సంయుక్తంగా నిర్మిస్తోన్న చిత్రం 'యాత్ర 2'. ఇందులో వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి పాత్రలో మలయాళం సూపర్ స్టార్ మమ్ముట్టి, వై.ఎస్.జగన్ పాత్రలో కోలీవుడ్ స్టార్ జీవా నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. సినిమాలో ప్రముఖ పాత్రల లుక్స్‌కి సంబంధించిన పోస్టర్స్‌ను మేకర్స్ విడుదల చేస్తూ వచ్చిన మేకర్స్ తాజాగా వై.ఎస్.జగన్ పాత్రను చేస్తున్న కోలీవుడ్ స్టార్ జీవా లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ పుట్టినరోజు సందర్భంగా 'యాత్ర 2' నుంచి స్పెషల్ పోస్టర్ విడుదల చేయటం విశేషం. వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర ఆధారంగా 'యాత్ర' చిత్రాన్ని తెరకెక్కించారు. అత్యంత ప్రజాదరణను పొందిన ఈ చిత్రంకు కొనసాగింపుగా, వైఎస్.ఆర్ తనయుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజా నాయకుడిగా ఎదిగిన తీరుని, 2009 నుంచి 2019 వరకు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రాజకీయ ఘటనల ఆధారంగా ఇప్పుడు 'యాత్ర 2'ని తెరకెక్కిస్తున్నారు. 'యాత్ర' చిత్రాన్ని ఫిబ్రవరి 8, 2019లో విడుదల చేసిన సంగతి తెలిసిందే. అలాగే ఇప్పుడు 'యాత్ర 2' ని కూడా అదే తేదీన ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నారు, 2024 ఫిబ్రవరి 8న ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతుంది.





# 'డంకీ' ఫస్ట్ డే ఫస్ట్ షో.. షారూక్ అభిమానుల హంగామా




బాలీవుడ్ బాద్షా షారూక్ ఖాన్, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ రాజ్‌కుమార్ హిరాని కాంబినేషన్‌లో రూపొందిన భారీ చిత్రం 'డంకీ'. ప్రపంచ వ్యాప్తంగా ఈ చిత్రం గురువారం (డిసెంబర్ 21) రోజున గ్రాండ్ రిలీజైంది. తొలిసారి షారూక్, రాజ్‌కుమార్ హిరాని కాంబోలో వచ్చిన సినిమా కావటంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ మూవీ ఫస్ట్ డే ఫస్ట్ షోను ముంబైలోని సింగిల్ స్క్రీన్ థియేటర్ గైటీ గెలాక్సీలో ఉదయం 5 గంటల 55 నిమిషాలకు ప్రారంభించారు. థియేటర్ ముందు షారూక్ ఖాన్ భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. తొలి ఆట కావటంతో డోలు, బాణా సంచాలతో వచ్చిన ఫ్యాన్స్, ప్రేక్షకులు సందడి చేశారు. థియేటర్‌లో ఓ పండుగ వాతావరణాన్ని సృష్టించారు. థియేటర్‌లో చేసిన హంగామాకు సంబంధించిన వీడియోను అభిమానులు సోషల్ మీడియాలో షేర్ చేశారు. వీడియోను గమనిస్తే డోలు కొడుతూ, బాణా సంచా కాల్చుతూ షారూక్ ఫ్యాన్స్ చేసిన సందడి గురించి ఎంత చెప్పినా తక్కువే. కొందరైతే విమానం తరహా కటౌట్స్‌తో కనిపించారు. వాటిపై డంకీ అని కూడా రాసి ఉంది. బాణా సంచా కాల్చటానికి చిన్నపాటి అరెంజ్‌మెంట్‌ను చేశారు. ఇక థియేటర్ బయట అభిమానులు డాన్సులు చేశారు. వారి ఆనందం చూస్తుంటే డంకీ సినిమా కోసం వారెంతో ఆతృతగా ఎదరురు చూశారనే విషయం స్పష్టమవుతుంది.

కన్నడ బ్యూటీ నభా నటేష్ తెలుగు ప్రేక్షకులకు నన్ను దోచుకుందువటే సినిమాతో పరిచయం అయిన విషయం తెల్సిందే. ఆ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకోకున్నా కూడా నటిగా మంచి మార్కులు దక్కించుకుంది. సినీ ప్రముఖులు కూడా నభా నటేష్ అందంతో పాటు అభినయం కు మంచి మార్కులు వేశారు. ఏకంగా పూరి జగన్నాథ్ సినిమా ఇస్మార్ట్ శంకర్ లో ఛాన్స్ దక్కించుకుంది. రామ్ కు జోడీగా నటించిన నభా కి ఇస్మార్ట్ శంకర్ మంచి విజయాన్ని తెచ్చి పెట్టింది. దాంతో ఇస్మార్ట్ బ్యూటీ అనే ట్యాగ్ ను దక్కించుకుంది. ఇస్మార్ట్ విజయాన్ని నభా నటేష్ సరిగ్గా ఉపయోగించుకోలేక పోయింది అనేది కొందరి అభిప్రాయం. సినిమాల్లో పెద్దగా ఆఫర్లు రాకున్నా కూడా సోషల్ మీడియాలో నభా నటేష్ షేర్ చేసే ఫోటోలు మరియు వీడియోల కారణంగా వైరల్ అవుతూనే ఉంటుంది. తాజాగా ఈ సెల్ఫీ తో అందరి దృష్టిని తన వైపు తిప్పకుంది అంటూ కామెంట్స్ వస్తున్నాయి. సోషల్ మీడియాలో నభా మరోసారి ట్రెండ్ అయ్యే విధంగా నడుము నాభి అందాన్ని చూపిస్తూ సెల్ఫీకి ఫోజ్ ఇచ్చింది. క్యూట్ అండ్ స్వీట్ అందం అంటూ నభా నటేష్ అందంకు అంతా కూడా ఫిదా అవుతున్నారు. ఇదే రేంజ్ అందాలను సోషల్ మీడియాలో కంటిన్యూ చేస్తే మళ్లీ సినిమాలతో బిజీ అయ్యే అవకాశాలు లేకపోలేదు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

# సెల్ఫీ అందాలతో ఇస్మార్ట్ బ్యూటీ


Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.